# మోడీ ప్రభుత్వ పాలనలో

## మంచి రోజులొచ్చింది మాత్రం మారాజులకే...




**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)**

ఆంధ్రప్రదేశ్ కమిటీ ప్రచురణ




భూసేకరణ బిల్లు

# విషయ సూచిక


పరిచయం 4

కార్పొరేట్ దేవుళ్ళకు శ్రామికుల బలి 9

**– సాత్యకి రాయ్‌త**

మోడీ నిర్లక్ష్యం వల్ల తీవ్రమౌతున్న వ్యవసాయ సంక్షోభం 13

**– విజూ కృష్ణన్**

ఉపాధి కల్పన ఉత్త గ్యాసు 20

**– సవేరా**

పప్పు ఉప్పు, కూరా నార విలాస వస్తువులే 24

**– శ్యామ్**

పేదలను ఆదుకునే పథకాల కోత 28

**– సురజిత్ మజుందార్**

మోడీ తరహా ఆర్థిక తోడ్పాటు 32

**– వి. రమేష్**

మహిళలను అణచివేసే తిరోగమన భావజాలం 36

**– నిషితా ముఖర్జీ**

కాషాయీకరణ – ఉన్మాదమూకల విజృంభణ 40

**– సుభాషిణీ అలీ**

మోడీ విదేశాంగ విధానం 43

**– అరుణ్ కుమార్**

పెరుగుతున్న ప్రజా ప్రతిఘటన 48

**– మహేష్, సవేరా**

మా మంచి పాలన (కాషాయుల కిష్కింధకాండ) 52

**– కిరణ్**

# పరిచయం

మోడీ ప్రభుత్వ పాలన మొదటి సంవత్సరం పూర్తయిన సందర్భంగా ప్రభుత్వ విధానాల పని తీరును విశ్లేషించే వ్యాసాలతో ఈ పుస్తకం ప్రచురిస్తున్నాము. ఇవన్నీ ఇదివరకు సిపిఐ(ఎం) వెబ్‌సైట్‌లో 'ఎక్సాల్ బురీహాల్' పేరుతో ప్రచురించబడ్డాయి.

2015 మే 26 నాటికి మోడీ ప్రభుత్వం ఏర్పడి ఒక సంవత్సరం గడిచింది. ఒకవైపు భారత పెట్టుబడిదారులు సంబరాలు చేసుకున్నారు. మరో వైపు ప్రభుత్వ శ్రామిక వ్యతిరేక విధానాల పట్ల నిరసనగా ఒక్క రోజు దేశవ్యాపిత సమ్మెకు అన్ని కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. మోడీ ప్రభుత్వం పట్ల వచ్చిన ఈ భిన్న స్పందనలు ప్రభుత్వ వర్గ స్వభావానికి అద్దం పడుతున్నాయి.

స్వేచ్ఛా మార్కెట్‌ను, ఆశ్రిత పెట్టుబడిదారీ విధానాన్ని కీర్తించే వందిమాగధులంతా మోడీ ప్రభుత్వాన్ని పొగడ్తలతో ముంచెత్తుతున్నారు. ఎకనామిక్ టైమ్స్ పత్రిక ప్రభుత్వ పని తీరును గురించి 55మంది సి.ఇ.ఓ.లను(ప్రైవేట్ కంపెనీల అధికారులు) విచారించింది. వారంతా సంతోషాన్ని ప్రకటించారు. వ్యాపారానికి పరిస్థితులెంతో అనుకూలంగా వున్నాయని ఏకాభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. వారి సంతోషానికి కారణం వుంది. పెట్టుబడి ఎటువంటి ఆంక్షలు, నియమ నిబంధనలు లేకుండా స్వేచ్ఛగా మసలే ఏర్పాటు జరిగింది. శ్రమ దోపిడీ మరింత తీవ్రమౌతున్నది. కార్మిక చట్టాలను మరింత బలహీన పరచి, భారత కార్మిక వర్గాన్ని బానిసత్వంలోకి నెట్టి వేసే చర్యలను మోడీ ప్రభుత్వం పార్లమెంటులో తన మంద బలాన్ని ఉపయోగించి సమర్థించుకుంటోంది.

ఈ పుస్తకం ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను బట్టబయలు చేస్తున్నది.

బిజెపి ప్రభుత్వ కృషిని అభినందించే మరో సంస్థ, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్, వారి పత్రిక ఆర్గనైజర్ ఈ సంవత్సర కాలాన్ని భారతజాతి పునరుజ్జీవ కాలంగా అభివర్ణించింది.

“నిజమైన మూల మలుపు జాతీయ మానసిక స్థితిలోనూ భావజాలంలోనూ” ఉందని ప్రకటించింది. విద్యారంగంలోను, సాంస్కృతిక రంగంలోను, ప్రభుత్వ సంస్థలలోను మతతత్వ భావజాలాన్ని చొప్పించే కృషిని చేస్తున్నందుకు ప్రభుత్వాన్ని ఆ పత్రిక మెచ్చుకుంది.

ఈ పుస్తకం రకరకాల అంశాలపై కాషాయీకరణ ప్రభావాన్ని గురించి వివరిస్తుంది.

గడచిన సంవత్సర కాలంలో కేంద్రంలోనూ, రాష్ట్రాలలోను వున్న బిజెపి ప్రభుత్వాలు సంఘ్ పరివార్ ఎజెండాను ఆచరణలోకి తెస్తున్నాయి. మైనారిటీ వ్యతిరేక ప్రచారం, మైనారిటీలపై దాడులు ఎక్కువవుతున్నాయి. మతతత్వ విషపూరిత భావజాలాన్ని వెదజల్లడం, ఎన్నికల సమయానికి మత చిచ్చును రగల్చడం ప్రణాళికాబద్ధంగా చేస్తున్నారు. ముజఫర్‌నగర్‌లో ఎన్నికల ముందు మతకలహాల్ని రెచ్చగొట్టారు. మహారాష్ట్ర, హర్యానాలలో గోమాంస నిషేధాన్ని విధించారు. క్రైస్తవుల ప్రార్థనా స్థలాలు, పాఠశాలలపై దాడులు జరుగుతుంటే బిజెపి ప్రభుత్వాలు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నాయి. వారి మౌన అంగీకారం స్పష్టమౌతున్నది. మైనారిటీలు ద్వితీయ శ్రేణి పౌరుల స్థాయిని ఆమోదించేలా వత్తిడి చేసే కార్యక్రమం జరుగుతోంది. ముస్లింలకు ఓటు హక్కు తీసివేయాలనే డిమాండు కూడా ముందుకొచ్చింది.

మోడీ ప్రభుత్వ సంవత్సర పాలన బడాపెట్టుబడిదారులకు, సంఘ్‌పరివార్‌కు మంచిరోజులను తెచ్చి పెట్టింది. కాని ప్రజలకు, ముఖ్యంగా శ్రామికులకు ఇది ఒక దౌర్భాగ్యకాలం. వారి జీవనభృతిపైన, వారి ప్రాథమిక హక్కులపైన దాడులు పెరుగుతున్న కాలమిది.

ఒక వైపు దేశమంతా తీవ్రమైన వ్యవసాయసంక్షోభాన్ని ఎదుర్కొంటూ వుంటే మరోవైపు మోడీ ప్రభుత్వం, బిజెపి శ్రేణులు వార్షికోత్సవ సంబరాలు జరుపుకుంటున్నారు. రైతులు, గ్రామీణ పేదలు తీవ్ర దుస్థితిలో వున్నారు. దేశవ్యాప్తంగా రైతుల ఆత్మహత్యలు పెరిగిపోయాయి. రైతులు తమ పిల్లల్ని, భూములను అమ్ముకుంటున్నారు. ఇదంతా వ్యవసాయరంగానికి, గ్రామీణాభివృద్ధికి నిధులివ్వకుండా మోడీ మొండి చెయ్యి చూపిన నేపథ్యంలో జరుగుతోంది. జాతీయ గ్రామీణ ఉపాధి పథకానికి నిధులు కోసివేసి గ్రామీణపేదలకు ఊపిరాడకుండా చేస్తున్నారు. వారికి పనిదొరికే అవకాశాలు మాయమైపోతున్నాయి.

ఈ పుస్తకం వ్యవసాయ సంక్షోభం, రైతుల దుస్థితిని ఎత్తిచూపుతుంది.

సమాజంలోని ఏ తరగతికీ ఈ దాడుల నుండి మినహాయింపులేదు.

దళితులు, ఆదివాసీలు తీవ్రమైన దాడులకు గురవుతున్నారు. వారి హక్కులు హరించివేయ బడుతున్నాయి. 5వ షెడ్యూల్‌లోని భూమిని వినియోగించుకునేందుకు గిరిజనుల అంగీకారం కావాలన్న క్లాజును తొలగించారు. గనులపై ఉన్న గిరిజన హక్కులను కాలరాసారు. కీలకమైన సేవలను ప్రైవేటీకరిస్తున్నారు. ప్రభుత్వ శాఖల పనులను బైటవారితో చేయిస్తున్నారు. రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్ హక్కును ఇలాంటి కుయుక్తులతో మాయం చేస్తున్నారు. ప్రైవేటీకరణ అంటేనే రిజర్వేషన్ల రద్దు. దీన్ని మోడీ ప్రభుత్వం వేగవంతంగా అమలు చేస్తోంది. షెడ్యూల్డు కులాల, తెగల సబ్‌ప్లాన్ నిధులు భారీకోతలకు గురవుతున్నాయి. నూతన గనుల చట్టం ఆదివాసుల హక్కులను తీవ్రంగా దెబ్బతీస్తోంది.

2015-16 బడ్జెట్‌లో స్త్రీ-శిశు సంక్షేమ పద్దు కేటాయింపులో రూ. 20,000 కోట్లు కోతలను విధించారు. ఈ కోతల వల్ల మహిళా శిశు సంక్షేమంపై తీవ్రమైన చెడు పరిణామాలుంటాయి. ఆరోగ్యపద్దుకు 20% కోత పడింది. ఇదిమరీ ఘోరం. అసలు భారత ప్రభుత్వం ఆరోగ్యరంగంలో ఖర్చు పెట్టేది జిడిపి (స్థూల జాతీయోత్పత్తి)లో ఒక్కశాతం మాత్రమే. ప్రపంచంలో కెల్లా హీనమైన స్థితి మనది. ఇప్పుడీ కోతల వల్ల కేంద్ర ప్రభుత్వ ఆరోగ్యపథకాలు కూల బడ్డాయి.

విద్యకు కేటాయింపులు కూడా కోసివేయబడ్డాయి. ఫలితంగా సర్వశిక్షా అభియాన్, మధ్యాన్న భోజన పథకాలు దెబ్బతింటున్నాయి. విద్య, వైద్యాల ప్రైవేటీకరణ జోరు పెరిగింది. విద్య, వైద్యం వ్యాపారం కావడం వల్ల ప్రజాబాహుళ్యానికి ఈ రెండు సేవలు అందుబాటులో లేకుండా పోతున్నాయి. మోడీ ప్రభుత్వం కార్మిక చట్టాలను సవరించడానికి సిద్ధమైంది. సంఘటిత శ్రామికవర్గ ఉద్యమాన్ని విచ్ఛిన్నం చేయడమే వీరిలక్ష్యం. కార్మికసంఘాల ఏర్పాటుకు అవకాశం లేకుండా చేయడానికి పూనుకున్నారు. కార్మికులతో చర్చలు లేకుండా చేయాలన్నదే వీరి ఆలోచన.

మోడీ ప్రభుత్వం తన సాంఘిక సంక్షేమకార్యక్రమాల గురించి గొప్పలు చెప్పుకుంటోంది. 'మేక్ ఇన్ ఇండియా' అంటూ హోరెత్తిస్తున్నారు. దీనిద్వారా పెద్ద సంఖ్యలో ఉద్యోగాలొస్తాయని ఊదర గొడుతున్నారు. మోడీ ఎన్నికలప్రచారంలో ఐదేళ్ళలో ఐదుకోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని ధీరోదాత్తమైన వాగ్దానం చేశారు. ఏడాది గడిచింది. ఉద్యోగాల ఊసులేదు. ధరల పెరుగుదలను అదుపుచేస్తామని ప్రగల్భాలు పలికారు. అదికూడా వట్టిదేనని తేలిపోయింది.

ఈ కాలంలో అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు బాగా పడిపోయాయి. ఇంత తక్కువ ధర గతంలో ఎప్పుడూ లేదు. 18మాసాల కిందట క్రూడాయిల్ ధర బ్యారల్ 110 డాలర్ల నుండి 40డాలర్లకు పడిపోయింది. దీని ప్రయోజనం ప్రజలకు అందకుండా మోడీ ప్రభుత్వం అడ్డుకుంది. పెట్రోల్, డీజిల్ ధరలు పెంచుకుంటూ పోతున్నారు. ఈ ఏప్రిల్‌లో పెట్రోల్ ధర 7రూపాయలు, డీజిల్ ధర 5రూపాయలు పెంచారు.

ఈ పుస్తకంలో కూరగాయలు, పప్పుల ధరలు విపరీతంగా పెరిగిన కారణాలు వివరించే వ్యాసం ఉంది.

కార్పొరేట్ మీడియా, మితవాద మేధావులు మోడీ విదేశీ పర్యటనల గురించీ, విదేశాంగ విధాన చొరవ గురించీ గొప్పగా ప్రచారం చేస్తున్నారు. మోడీ నాయకత్వంలో భారతదేశం ఒక గొప్ప ప్రపంచ శక్తిగా తయారవుతోందని డబ్బా కొడుతున్నారు. కాని మోడీ విదేశాంగ విధానంలోని కీలకాంశం ఏమిటంటే–భారత్‌కు అమెరికాతోను, దాని మిత్రులు జపాన్, ఆస్ట్రేలియా, ఇజ్రాయిల్ దేశాలతోను అంటకాగడం. అలీన విధానాన్ని, అభివృద్ధిచెందుతున్న దేశాలను, దక్షిణ దేశాల మధ్య సహకార ప్రాధాన్యతను విస్మరించడం – ఇదే వీరి విదేశాంగ విధానం.

మోడీ హయాంలో ప్రజాతంత్ర సంస్థలపై దాడులు జరుగుతున్నాయి. పార్లమెంటు కార్యక్రమాల పట్ల అసహనధోరణి కనిపిస్తున్నది. నిరంకుశ పెత్తందారీ పోకడలు పెరుగుతున్నాయి. మనకు సహకార ఫెడరల్ స్ఫూర్తి వుండాలని, కేంద్ర–రాష్ట్ర సంబంధాలను మెరుగుపర్చుకుందామని మోడీ ప్రభుత్వం కబుర్లు చెబుతోంది. ఆచరణ మాత్రం శూన్యం. రాష్ట్రాలకు రావాల్సిన నిధులకు కోతలు పడుతున్నాయి. 14వ ఆర్థిక సంఘం సిఫార్సుల ప్రకారం కేంద్రానికి వచ్చే పన్నులలో 42% రాష్ట్రాలకు ఇవ్వాల్సి వుంటుంది. ఇది సాకుగా రాష్ట్రాలలో అమలు చేసే కేంద్ర పథకాలకు నిధులను కోసి వేయడం మొదలుపెట్టారు. చివరకు జరిగిందేమిటంటే రాష్ట్రాలకు వచ్చే మొత్తం నిధులు పెరగాల్సిందిపోయి గణనీయంగా తగ్గాయి. ఈశాన్య రాష్ట్రాలకున్న ప్రత్యేక హోదాను రద్దు చేస్తున్నారు. దీని పట్ల ఆ రాష్ట్రాల ముఖ్యమంత్రులు అభ్యంతరాలు తెలిపారు. ఐనా మోడీ ప్రభుత్వం కేంద్రీకరణనే బలవంతంగా రాష్ట్రాలపై రుద్దుతున్నది.

ఈ తిరోగమన ప్రజావ్యతిరేక ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని అఖిలభారత కార్మిక సంఘాలు, ఫెడరేషన్లు పిలుపునిచ్చాయి. ఉవ్వెత్తున ఎగిసిపడే పోరాటాలకు,

ఉద్యమాలకు జరగబోయే సార్వత్రిక సమ్మె నాయకత్వం వహిస్తుంది. ఇటీవలి మాసాలలో భూసేకరణ చట్టానికి సవరణలు చేసే ప్రయత్నాన్ని వ్యతిరేకిస్తూ దేశవ్యాపిత ఆందోళనలు జరుగుతున్నాయి. ఈ పోరాటాలు, ఉద్యమాలు సమీకృతమై మోడీ ప్రభుత్వ ఆర్థిక విధానాలను, మతతత్వ కుట్రలను, ఆధిపత్య ధోరణులను వ్యతిరేకించే బలమైన ఐక్య వేదిక నిర్మాణానికి దారితీయాలి.

ఈ పుస్తకం అటువంటి ఉద్యమానికి తోడ్పడుతుందని ఆశిస్తున్నాం.

✡

# కార్పొరేట్ దేవుళ్ళకు శ్రామికుల బలి

**- సాత్యకి రాయ్**

పరిశ్రమలు ఎప్పటి నుంచో కోరుకుంటున్న కార్మిక సంస్కరణలను అమలు చేయడానికి మోడీ ప్రభుత్వం పట్టుదలగా వుంది. నూతన సంస్కరణలను 2014 అక్టోబరులో ప్రవేశపెట్టారు. ఆ సందర్భంలో మాట్లాడుతూ ప్రధానమంత్రి కార్మికుల ప్రాధాన్యాన్ని నొక్కి చెప్పారు. కార్మిక సమస్యలను కార్మికుల ప్రయోజనాల పరంగా చూడాలి గాని, యజమానుల దృష్టితో చూడగూడదని కూడా చెప్పారు. మాటలు చాలా బాగున్నాయి. ఆచరణ మాత్రం ఈ 'శ్రమయోగులకు' పూర్తి వ్యతిరేకంగా ఉన్నట్టు రుజువౌతున్నది. అంతేకాదు. భారత కార్పొరేట్లకు కావల్సినవన్నీ ధృఢదీక్షతో సమకూరుస్తున్నందు వలన వారికి ఇవెంతో మంచిరోజులు. కార్యాచరణ కార్మిక భారత్‌కు వ్యతిరేకంగాను, కార్పొరేట్ భారత్‌కు అనుకూలంగాను వున్నది. భారతదేశంలో పని కోసం ఎదురుచూస్తున్న శ్రమశక్తి విస్తారంగా వుంది. ఇది శ్రమ దోపిడీకి పూర్తి అనుకూల పరిస్థితి. హీనమైన పని పరిస్థితులలోను, అతి తక్కువ వేతనాలకు పని చేయడానికి ప్రజలు సిద్ధంగా వున్నారు.

అందువలన భారతదేశం అతి నికృష్ట వేతనాలిచ్చే దేశాలలో ముందుంది.

భారత కార్మికవర్గానికి సంస్థాగతంగాను, చట్టపరంగాను వున్న హక్కులను హరించి వేయడానికి కార్మిక సంస్కరణలు ముందుకొచ్చాయి. కారుచౌకగా శ్రమ దొరికే ఏర్పాటు చేశాం, రండి పెట్టుబడి పెట్టి అంతులేని లాభాలార్జించండి- అని ప్రపంచ పెట్టుబడికి స్వాగతం పలకడానికే కార్మిక సంస్కరణలు వచ్చాయి.

మొట్టమొదట చిన్న ఫ్యాక్టరీల చట్టం - 2014 ను ప్రవేశపెట్టారు. ఈ చట్టం 40మంది కంటే తక్కువ మంది కార్మికులతో పనిచేసే ఫ్యాక్టరీలను 16 కార్మికచట్టాల నుండి మినహాయిస్తుంది. ఆ 16చట్టాలలో ముఖ్యమైనవి ఫ్యాక్టరీల చట్టం, పారిశ్రామిక వివాదాలచట్టం, ఇ.యస్.ఐ.చట్టం, ప్రసూతి వెసులుబాటు చట్టం. ఈ చట్టాల సవరణల ద్వారా ఇప్పటివరకు

లభిస్తున్న హక్కులు 13లక్షల మంది కార్మికులకు లేకుండాపోతాయి. దేశంలోని మొత్తం ఫ్యాక్టరీలలో 65శాతం ఫ్యాక్టరీలకు ఈ మార్పు వర్తిస్తుంది.

పారిశ్రామిక వివాదాల చట్టం ప్రకారం 100 మంది పని చేసే కర్మాగారాలు కార్మికులను పనిలోంచి తొలగించాలంటే ప్రభుత్వం నుండి ముందుగా అనుమతి తీసుకోవాలి. యాజమాన్యాలు అడ్డగోలుగా తీసి పారేయకుండా ఈ నిబంధన కొంతవరకైనా అడ్డుపడుతుంది. నూతన చట్టం ప్రకారం 300మంది, ఆపైన కార్మికులు పని చేసే కర్మాగారాలకు మాత్రమే ఈ నిబంధన వర్తిస్తుంది. దీనివల్ల 93శాతం ఫ్యాక్టరీలకు ఈ నిబంధన వర్తించదు. ఇక ఈ నిబంధన వున్నా లేనట్లే. 93శాతం కర్మాగారాల యజమానులు వాళ్ళిష్టమొచ్చినట్లు కార్మికులను తీసివేయవచ్చు. కాంట్రాక్టు కార్మికచట్టాన్ని కూడా మార్చారు. ఇప్పటి వరకు 20మంది కాంట్రాక్టు కార్మికులు ఒక పనిలో వుంటే వారికి కార్మికచట్టాలు వర్తించాయి. ఇప్పుడాసంఖ్యను 20 నుండి 50కి పెంచారు. ఒక పనిలో 20మంది వుంటే దొరికిన కొద్దిపాటి రక్షణ ఇప్పుడు 50మంది వున్నా దొరకదు. కాంట్రాక్టు కార్మికులు ప్రైవేటు రంగంలో పని చేస్తున్నా, పబ్లిక్ సెక్టర్‌లో పని చేస్తున్నా ఈ విషయంలో తేడా ఏమీలేదు. *'కార్మిక చట్టాలను సరళం చేస్తే పరిశ్రమలకు మంచి వెసులుబాటు వస్తుంది. హాయిగా వ్యాపారం చేసుకుంటారు.'* --ఇదీ ప్రభుత్వ ధోరణి. 'ఇన్నాళ్ళూ యజమానులను రూల్సు, లెక్కలు, రిజిస్టర్లు అంటూ నానా ఇబ్బందులు పెట్టడం జరిగింది. ఇక ముందు అలా జరగనివ్వం' అని మోడీ ప్రభుత్వం నిర్ణయించింది.

అందుకోసమే 16 ముఖ్యమైన కార్మిక చట్టాల నుండి పారిశ్రామిక వేత్తలకు విముక్తినిచ్చింది. ఈ మంచిరోజు కోసమే పారిశ్రామికాధిపతులు ఎదురు చూస్తూ వచ్చారు. వారికి మంచిరోజులు ప్రసాదించే మంచి ప్రభుత్వం రానే వచ్చింది!

14సం॥లోపు వయస్కులైన బాలకార్మికుల సంఖ్య విషయంలో ప్రపంచంలో భారతదేశం అగ్రస్థానంలో వుంది. బాలకార్మికులు వ్యవసాయంలో వున్నారు. చిన్న కార్ఖానాలలో వున్నారు. సరుకులు మోసే పనిలో వున్నారు. రోడ్లమీద చెత్తలోంచి వస్తువులు ఏరేపనిలో వున్నారు. అంతేకాదు గాజుతయారీ, గనులు, నిర్మాణాలు, తివాసీనేత, జరీ తయారీ, దీపావళి మందుసామగ్రి తయారీ వంటి ప్రమాదకరమైన పనుల్లోనూ వున్నారు. దీనికి వ్యతిరేకంగా చట్టం వుంది. బాలకార్మిక చట్టం 1986లో వచ్చింది. ఈ చట్టం అమలులోని వైఫల్యం అందరికీ తెలిసిందే. ఈ చట్టాన్ని ప్రభుత్వం సవరించబోతున్నది. '14సం॥లోపు పిల్లలు పనిచేయకుండా నిషేధాన్ని ఖచ్చితంగా అమలుచేస్తాము. ఐతే, స్కూలు నుంచి వచ్చాక

కుటుంబానికి సహాయపడేందుకు పిల్లలు పనిచేయవచ్చు,' ప్రభుత్వ ప్రతిపాదనలో ఇదొక మెలిక. ఈ మెలిక ద్వారా ఇళ్ళల్లో జరిగే కాంట్రాక్టు పనులు పిల్లలతో చేయించవచ్చు.

ఐక్యరాజ్యసమితి తీర్మానం ప్రకారం 18సం॥ లోపు వయసున్న వారిని పిల్లలుగా పరిగణించాలి. మన ప్రభుత్వం ప్రవేశపెడుతున్న బిల్లు ప్రకారం 14-18 మధ్య వయస్కులైన పిల్లలు ప్రమాదకరం కాని పరిశ్రమలలో పని చేయవచ్చు. ఇది ఐరాస తీర్మానానికి ఉల్లంఘన. బాలకార్మికుల పునరావాసం గురించి బిల్లు మాట్లాడదు. 14-18 మధ్య వయసు పిల్లలు పనిచేయవచ్చు అని చెప్పిన బిల్లు, వారి పని పరిస్థితుల గురించి కాని, వారి జీతాలకు సంబంధించిన వివాదాలనెలా పరిష్కరించాలని గాని ఏమీ చెప్పదు. మీరూ మీరూ చూసుకోండని అర్థం.

కార్మికచట్టాల సంస్కరణల గురించి మధ్యతరగతి పెద్దగా పట్టించుకోవడం లేదనుకోవాలి. నయాఉదార వాద, సరళీకృత విధానాల పరిపాలన, దానికి అనుకూలమైన సాంస్కృతిక యంత్రాంగం కార్మిక వ్యతిరేక సంస్కరణలకు అనుకూల వాతావరణాన్ని సమాజంలో ఏర్పాటు చేసింది. లేబర్ మార్కెట్‌ను సరళం చేయడానికి సంస్కరణలు అవసరమంటున్నారు. అసలు లేబర్ మార్కెట్ కఠినంగా వున్నదెప్పుడు? అంతర్జాతీయ కార్మిక సంస్థ నివేదిక ప్రకారం-భారత్‌లో 2009-10సం॥లో వ్యవసాయేతర రంగాలలో అసంఘటిత కార్మికులు 83.6% వున్నారు. (అదే సం॥లో చైనాలో 32.6%, బ్రెజిల్‌లో42.2% వున్నారు.) దీనర్థం-భారత దేశంలో పనిచేసే వారిలో అత్యధికభాగానికి ఎటువంటి కార్మిక హక్కులు లేవు. వ్యవసాయాన్ని కూడా కలిపిచూస్తే నూటికి 93మంది భారత శ్రామికులకు ఎలాంటి హక్కులు, రక్షణలు లేవు. 'శ్రమయేవ జయతే' అంటే ఇదేనా? సంఘటిత రంగానికి చెందిన పరిశ్రమలలో మూడవ వంతు మంది కాంట్రాక్టు కార్మికులున్నారు. వీరికే హక్కులూ వుండవు.

రెండవదిగా, పారిశ్రామిక రంగం వార్షిక సర్వే ప్రకారం పారిశ్రామిక విభాగంలో (అంటే ఫాక్టరీ చట్టం 1948)గాని సంఘటిత రంగంలోగాని కాంట్రాక్టు పనివారు దాదాపు మూడవ వంతు ఉన్నారు. అంటే సంఘటిత రంగంలో కూడా మూడవ వంతు కార్మికుల పట్ల యాజమాన్యాలు వారితో పాటే పనిచేసే పర్మినెంటు కార్మికుల పట్ల తీసుకొనే చట్టపరమైన చర్యలు ఏమీ తీసుకోవడం లేదు.

ఇంకా ఇంకా దిగజార్చాలనుకుంటున్న కూలి ధరలు ఇప్పుడెలాగున్నాయో చూద్దాం.

పారిశ్రామిక రంగం వార్షిక సర్వే తాజానివేదిక ప్రకారం-2012-13 సం॥లో మొత్తం ఉత్పత్తి విలువలో  అన్ని రకాల సౌకర్యాలను పరిగణనలోకి తీసుకునికూడా శ్రమకి చెల్లించేది

సరాసరి 2.17%. అంటే ప్రతి వంద రూపాయలలోను – 2రూపాయల17పైసలు. ప్రపంచ పోటీలో నిలబడటానికి దీన్ని ఇంకా కిందకి తొక్కాలట!

1980లలో ఉత్పత్తి విలువకు పైన వచ్చిన అదనపు విలువలో 26% కార్మికుల వేతనాలకు చేరేది. అదికాస్తా ఈ దశాబ్దంలోని చివరకు 10%కు దిగజారింది.

అదే సమయంలో మొత్తం అదనపు విలువలో లాభాల శాతం 5.3 నుండి 21.3 శాతం పెరిగింది. ఈ అంకెలు ఇప్పటికే గడచినకాలంలో అదనపు శ్రమ సంపద సృష్టించిన దానిలో కార్మికవర్గం తనవాటాను ఎంతగా కోల్పోయిందో తెలియజేస్తున్నాయి. ఈ పరిస్థితులలో కార్మిక సంస్కరణలు 'ఎక్కువ' జీతాలు తగ్గించడానికి అనే లక్ష్యంతో చేస్తున్నామంటే ఎంత హాస్యాస్పదంగా ఉంది! ఇది కేవలం ఆశపోతు పెట్టుబడి దారులు శ్రమజీవులపై తమ ఆధిపత్యాన్ని మరింతగా పెంచుకోవాలన్న కోరికను నగ్నంగా సమర్థించేందుకు చేసే సేవే!

✡

# మోడీ నిర్లక్ష్యం వల్ల తీవ్రమవుతున్న వ్యవసాయ సంక్షోభం

– విజూ కృష్ణన్

భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వస్తే రైతులకు మంచి రోజులు వచ్చేలా చూస్తామనీ రైతుల ఆత్మహత్యలను నివారిస్తామనీ నరేంద్రమోడీ ఎన్నికల వాగ్దానం చేశారు. బి.జె.పి. ప్రభుత్వం వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి కోసం ప్రభుత్వ పెట్టుబడులను పెంచుతుందనీ, రైతులకు 50శాతం లాభం వచ్చేలా చూస్తుందనీ నమ్మపలికారు. వ్యవసాయ ఖర్చులు తగ్గిస్తామన్నారు. రుణ సదుపాయం కల్పిస్తామన్నారు. ఆధునిక సాంకేతిక సదుపాయాలను అందిస్తామన్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి గ్యారంటీ పథకాన్ని వ్యవసాయంతో అనుసంధానం చేస్తామన్నారు. వ్యవసాయ భీమా పథకాన్ని అమలు చేస్తామన్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు దెబ్బతింటే ఆదుకుంటామన్నారు. గ్రామీణ రుణసదుపాయాన్ని అందరికీ అందిస్తామన్నారు. నీటి పారుదల సౌకర్యాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. ప్రపంచ మార్కెట్ ధరల ఎగుడు దిగుళ్ళ తాకిడి నుంచి రైతులను రక్షిస్తామన్నారు. అందు కోసం ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేస్తామన్నారు. ఇవన్నీ బి.జె.పి. ఎన్నికల ప్రణాళికలో చేసిన వాగ్దానాలే. ఇవి మాత్రమే కాదు–ఇంకా వున్నాయి చూడండి......'జాతీయ భూవినియోగ విధానాన్ని' చేపడతామన్నారు. దాని ప్రకారం వ్యవసాయానికి పనికిరాని భూమిని మాత్రమే సేకరించి అభివృద్ధి చేస్తామనీ, రైతుల ప్రయోజనాలను కాపాడతామనీ; ఆహార ఉత్పత్తి లక్ష్యాల పట్లా, జాతీయ ఆర్థిక లక్ష్యాల పట్లా శ్రద్ధ వహిస్తామనీ చెప్పారు. 60 సంవత్సరాలు దాటిన రైతులనూ, బీదాబిక్కీ రైతులనూ, వ్యవసాయ కార్మికులనూ సంక్షేమ కార్యక్రమాలతో ఆదుకుంటామన్నారు. ఇంతకంటే ఒక రైతు ఏం కోరుకుంటాడు?

కానీ, మోడీ ప్రభుత్వ సంవత్సర పాలన వ్యవసాయ సంక్షోభాన్ని మరింత పెంచింది. గత సంవత్సరం 3.7% వున్న వ్యవసాయాభివృద్ధి రేటు ఈ సంవత్సరం 1.1 శాతానికి పడిపోయింది. రైతుల ఆత్మహత్యలు పెరిగాయి. 2014 డిసెంబరులో వేసిన ఒక అంచనా ప్రకారం రైతుల ఆత్మహత్యలు 26శాతం పెరిగాయి. (మోడీ ప్రభుత్వ పాలన 6 నెలలు గడిచిన సందర్భాన్ని పురస్కరించుకుని చెప్పుకోదగ్గ విజయం ఇది). బి.జె.పి. పాలనలో వున్న మహారాష్ట్ర అయితే రైతుల ఆత్మహత్యల విషయంలో 40శాతం అభివృద్ధిని సాధించింది. 2014 ఆగస్టు, 2015 ఫిబ్రవరి మధ్య కాలంలో 1373 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. మరలా 2015 మార్చి నెలలో పెద్ద సంఖ్యలో రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. దీనికి కారణం దేశవ్యాప్తంగా 2కోట్లహెక్టార్లలో పంటలకు భారీ నష్టం జరగడం, ప్రభుత్వం నిర్లిప్తంగా వ్యవహరించడమే. హర్యానా, పంజాబ్, గుజరాత్, పశ్చిమ బెంగాల్, తెలంగాణా, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గడ్ రాష్ట్రాలలో గతంలోఎన్నడూ జరగనన్ని ఆత్మహత్యలు జరిగాయి. హర్యానాలో సరిగ్గా గడచిన రెండుమాసాల్లో 60 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. బాధితులకు ఓదార్పు లేదు, సానుభూతి లేదు, నష్ట పరిహారం ప్రసక్తి లేదు, ఆదుకునే ఆలోచనే లేదు. పైపెచ్చు దొరల స్పందన ఎలా వుందో చూడండి. హర్యానా వ్యవసాయ మంత్రి (బిజెపి) ఆత్మహత్యకు పాల్పడ్డ రైతులు పిరికి వాళ్ళనీ నేరగాళ్ళనీ దూషించాడు. మహారాష్ట్ర బిజెపి మంత్రులు కూడా అదేపద్ధతిలో స్పందించారు. ఇక కేంద్ర వ్యవసాయ మంత్రి ఐతే హర్యానాలో ఒక్క రైతు కూడా ఆత్మహత్య చేసుకోలేదని పార్లమెంటులో ప్రకటించారు. వాస్తవాన్ని గుర్తించడానికీ, బాధ్యతను స్వీకరించడానికీ ప్రభుత్వం నిరాకరిస్తున్నది. ఇది క్షమించ రాని ధోరణి.

మోడీ తన ఎన్నికల ప్రసంగాలలో ఒక వాగ్దానాన్ని పదేపదే చేశాడు. వ్యవసాయఖర్చులపై కనీసం 50 శాతం లాభం వచ్చేలా చూస్తామనీ, అందుకవసరమైన చర్యలన్నీ తీసుకుంటామనీ హామీ ఇచ్చాడు. ఈ విషయంలో బిజెపి ప్రభుత్వం నమ్మకద్రోహం చేసింది. చేసిన వాగ్దానాలకు అనుగుణమైన ఆచరణ ఏమీ లేదు. గోధుమ, వరి పంటలకు కనీస మద్దత్తు ధర క్వింటాలుకు 50రూపాయలు మాత్రం పెంచారు. దీనివల్ల ఒరిగిందేమీ లేదు. ఇతర పంటలకు సాయం సున్నా. వ్యవసాయ ఖర్చులపై 50శాతం లాభం సాధ్యం కాదని బిజెపి ప్రభుత్వం ఫిబ్రవరి15న సుప్రీంకోర్టు ముందు మొరపెట్టుకుంది. వ్యవసాయ ఖర్చులు ఆకాశాన్నంటుతుంటే ధరలనదుపు చేయడానికి ప్రభుత్వం చేసిందేమీ లేదు. పంటలకు మార్కెట్ ధరలు గాని, కనీసమద్దత్తు ధరలు గాని గిట్టుబాటు అయ్యే పరిస్థితి లేదు సరికదా ఉ



త్పత్తి ఖర్చులు కూడా రాని పరిస్థితి ఏర్పడింది. సేకరణ విధానాన్ని నిర్వీర్యం చేసి నిస్సహాయ స్థితిలో వున్న రైతును ప్రైవేటు వ్యాపారి దోచుకోవడానికి అనుకూలమైన వాతావరణం కల్పించారు. పరిస్థితి ఇలా వుంటే కేంద్రప్రభుత్వం ఏం చేసిందో చూడండి. తాను నిర్ణయించిన కనీస మద్దతు ధరకు పైన రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అదనంగా ఏమాత్రం సహాయం చేయ కూడదని హెచ్చరించింది. ఈ హెచ్చరికను ఖాతరు చేయని రాష్ట్రాల నుండి ధాన్యం సేకరించరాదని ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాను ఆదేశించింది. మార్కెట్ క్రమశిక్షణను కాపాడే పవిత్ర కర్తవ్య నిర్వహణలో భాగంగా ఇలా ఆదేశించారట. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా మన రైతుల వద్ద ఆహారధాన్యాలు కొనుగోలు చేసే విషయం మనందరికీ తెలిసిందే. ఈ సంస్థను ధ్వంసం చేయడానికి ప్రభుత్వం పని మొదలు పెట్టింది. 2013లో అమలులోకి వచ్చిన ఆహారభద్రతా చట్టాన్ని కూడా నీరుగార్చే పని చేపట్టింది. రైతుల లాభాలను పణంగా పెట్టమని, దేశీయ ఆహార భద్రతను ఎట్టి పరిస్థితులలోనూ రాజీపడబోమని డబ్లు.టి.ఓ ప్రపంచ వర్తక సంఘం దగ్గర ఒకవైపు బీరాలు పలుకుతూ అందుకు పూర్తి విరుద్ధంగా అమెరికా, యూరోపియన్ యూనియన్, డబ్ల్యు.టి.ఓ డిమాండ్లకు అనుగుణంగా జాతీయ ఆహార భద్రత కార్యక్రమాన్ని, ప్రభుత్వ నిల్వల కార్యక్రమాన్ని నీరు గారుస్తున్నది. వ్యవసాయోత్పత్తుల ధరల స్థిరీకరణ నిధి విషయంలో ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదు. బడా వాణిజ్య సంస్థల లాభాల కోసం రైతుల ప్రయోజనాలను పణంగా పెడుతున్నారు.

వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి అంశాలపై ప్రభుత్వ పెట్టుబడులను దారుణంగా కోసివేశారు. వ్యవసాయ రుణాలు మాయమయ్యాయి. వడ్డీవ్యాపారులు రైతులను పీల్చిపిప్పి చేస్తున్నారు. బ్యాంకు రుణాల్లో ఎక్కువ భాగం వ్యవసాయ సంబంధ వ్యాపారసంస్థలూ, పట్టణ ప్రాంత రైతులుగా ముద్ర వేసుకున్న బడా బాబులూ అందుకుంటున్నారు. ఇటీవలి జాతీయ గణాంకసంస్థ నివేదిక 70వ వరుస (జనవరి – డిసెంబరు 2013) ప్రకారం– దేశవ్యాప్తంగా 60శాతం గ్రామీణ కుటుంబాలు అప్పుల పాలయ్యాయనీ, ఆంధ్రప్రదేశ్‌లో అయితే నూటికి 92.9% గ్రామీణకుటుంబాలు రుణ గ్రస్తమయ్యాయనీ తెలుస్తున్నది. అప్పుల ఊబిలో కూరుకుపోయిన ప్రజలను ఆదుకునేందుకు బిజెపి ప్రభుత్వం చేసిందేమీలేదు. రైతులకు సరళమైన రుణసదుపాయం కల్పించుదామన్న ఆలోచన అసలే లేదు. 2014–15 బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి కేటాయించింది రూ.11,531కోట్లు కాగా 2015–16 బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి కేటాయించింది రూ.11,657కోట్లు. నిజవిలువతో చూస్తే పెంచిందేమీలేదు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి గ్యారంటీ పథకాన్ని నిధులు తగ్గించి నీరసపరుస్తున్నారు. 6576 బ్లాకుల్లో నడుస్తున్న ఈ పథకాన్ని 2500 బ్లాకులకు పరిమితం చేస్తున్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి గ్యారంటీ పథకం కోసం 227కోట్ల పనిదినాలకు గాను రూ61వేల కోట్ల రూపాయలు కేటాయించాలని గత సంవత్సరం అప్పటి కేంద్ర–రాష్ట్రప్రభుత్వాల సంయుక్త సమావేశంలో అంచనా వేశారు. అంచనాను ఖాతరు చేయకుండా బిజెపి ప్రభుత్వం 2014–15 బడ్జెట్‌లో కేవలం రూ.34699 కోట్లు అంటే 45% అంచనా వ్యయానికి కుదించింది. ఇది అవసరమైన దానికన్నా చాలా తక్కువ. కేటాయింపులు సగానికి నరికేసింది. చిన్నరైతులు, వ్యవసాయ కార్మికులు ఆదాయం క్షీణించడం– ధరల పెరుగుదల వల్ల దుర్భర పరిస్థితులనెదుర్కొంటున్నారు. వారినాదుకోవడానికి ఈ ప్రభుత్వం చేసిందేమీ లేదు. నీటిపారుదలకు, సేంద్రీయ వ్యవసాయానికి కలిపి కేంద్రం రూ.5600 కోట్లు కేటాయించింది. మన దేశంలో 600 జిల్లాలున్నాయి. ఈ లెక్కన రెండు పథకాలకీ గాను ఒక్కొక్క జిల్లాకు లభించేది 9కోట్ల రూపాయలు. ఈ నిధులు నీటి పారుదల కవసరమైన ఏ నిర్మాణానికి గాని, సేంద్రీయ వ్యవసాయాన్ని పెంపొందించే ఏ పథకానికి గాని ఎలా సరిపోతాయో ఎవరైనా ఊహించవచ్చు.

ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలకు నష్టం జరిగినపుడు ఆదుకోవడానికి సమగ్ర పంటల భీమా పథకాన్ని ఏర్పాటుచేస్తామని చేసిన వాగ్దానం మరిచారు. ఈ వాగ్దానాన్ని నిలబెట్టుకోలేదు. ఇటీవల అకాల వర్షాలు, తుఫానుల వల్ల దేశంలో అనేక చోట్ల పంటలు



నాశనమయ్యాయి. బిజెపి ప్రభుత్వం నష్టం జరిగిన ప్రాంతంలో సగాన్ని మాత్రమే లెక్కలోకి తీసుకుని లక్షల సంఖ్యలో రైతులకు నష్టపరిహారానికి అనర్హులను చేసింది. ప్రభుత్వం ఎకరాకు 12వేల రూపాయల నష్టపరిహారాన్ని ప్రకటించింది. ఇది చాలా పెద్దమొత్తమని కూడా చెప్పుకుంది. వాస్తవం వేరుగా వుంది. హర్యానాలో ఎకరాకు కౌలురేటే 45వేల రూపాయలు. ఇందుకు వ్యవసాయి ఖర్చులు అదనం. 12వేల నష్టపరిహారం చేతికందినా రైతు తీవ్ర రుణభారాన్ని మోస్తూనే వుంటాడు. దేశంలో కొన్ని ప్రాంతాల్లో అయితే నష్టపరిహారం అంటూ ఎకరాకు 5రూపాయలు, 63 రూ॥, 200రూ॥ నష్టపరిహారం ఇచ్చి చేతులు దులుపుకున్నారు. అన్ని తరగతుల రైతుల ఆదాయాలూ ఏటికేడాదీ దిగనారిల్లుతున్నాయి. తమ ఆస్థులను అమ్ముకోవడం తప్పనిసరి అవుతున్నది. మరోవైపు ఆధునిక టెక్నాలజీనిగాని, ట్రాక్టర్లు మరియు నీటి సదుపాయం కోసం అవసరమైన వసతులుగాని ఏర్పాటు చేసుకునే స్తోమతు లేకుండా పోయింది.

బిజెపి ప్రభుత్వం భూసేకరణ చట్టం గురించి తాను గతంలో తీసుకున్న వైఖరిని పూర్తిగా వదిలేసింది. తాను గతంలో చెప్పినదానికి వ్యతిరేకంగా పని చేస్తున్నది. 2014 డిసెంబరులో ఒక ఆర్డినెన్సు జారీ చేసింది. ఈ ఆర్డినెన్సు వ్యవసాయ భూముల్ని

బడాకంపెనీలకు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అప్పజెప్పడానికి ఏ అడ్డంకులూ రాకుండా చూసుకుంటుంది. బ్రిటిష్ పాలనలో 1894 నాటి క్రూరమైన భూసేకరణ చట్టాన్ని తిరిగి ఈ ఆర్డినెన్స్ రూపంలో అమలులోకి తెస్తున్నారు. దీని ప్రకారం భూమిని సేకరించడానికి రైతుల అనుమతి తీసుకోవాల్సిన అవసరం లేదు. ప్రజా జీవితంపై భూసేకరణ ప్రభావాన్ని అంచనా వేసే ఆలోచనను వదిలేశారు. నూతన ఆర్డినెన్స్‌లోని సెక్షన్ 10-ఎ లో పేర్కొన్న పథకాలకు భూమిని సేకరించడానికి ఏ నిబంధనలూ అడ్డురావు. రెండు అంశాలు ప్రధానమైనవి. ప్రత్యేక కేటగిరిలో 5 అంశాలున్నాయి. అందులో (1) పారిశ్రామిక కారిడార్లు (2) ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంలో మౌలిక సదుపాయాల కల్పన ముఖ్యమయినవి. సేకరించే భూమిలో చాలావంతు ఈ రెండు అంశాల పరిధిలోకే వస్తుంది. 2013 భూసేకరణ-పునరావాసం చట్టంలో పేర్కొన్న కనీస రక్షణ కూడా ఇప్పుడు ఎవరికీ ఉండదు. ఒకవైపు రక్షణ చట్టం వున్నట్టు కనిపిస్తుంది. రెండోవైపు కొన్ని సందర్భాలలో మాత్రమే రక్షణ మినహాయిస్తున్నట్లు చెబుతున్నారు. వాస్తవానికి నూతన విధానం పాత చట్టం కల్పించే ఉపశమనాన్ని దూరం చేస్తున్నది. పారిశ్రామిక కారిడార్లంటే- ఎంచుకున్న రహదారికిగాని, రైలు మార్గానికి గాని రెండు వైపులా చెరొక కిలోమీటరు మేరకు భూమిని లాక్కుంటారు. ఇక్కడ ఒక ఉదాహరణ చూద్దాము. ఢిల్లీ - ముంబాయి పారిశ్రామిక కారిడారు 6 రాష్ట్రాల గుండా వెళుతుంది. ఇది 7లక్షల చదరపు కిలోమీటర్ల భూమిని లాగేసుకుంటుంది. ఇది దేశంలోని మొత్తం వ్యవసాయ భూమిలో 17.5 శాతం. అంటే మన దేశంలోని ప్రతి వంద ఎకరాల నుండి 18 ఎకరాలను ఈ ఒక్క పథకమే మింగేస్తుంది. ఇంత పెద్ద ఎత్తున పంటభూముల్ని రైతుల నుండి గుంజుకోవడం కనీ వినీ ఎరుగని దుర్మార్గం. దీని ఫలితం ఏమిటి? అత్యంత సారవంతమైన భూమి వ్యవసాయానికి దూరమౌతుంది. దీని వల్ల దేశ ఆహార భద్రతకు ప్రమాద మేర్పడబోతున్నది. బహుళ పంటలు పండే సారవంతమైన భూమికిగాని, నీటి ఆధారిత భూములకుగాని ఏ రక్షణా ఉండదు. సొంతభూమి లేకుండా భూమిపై ఆధారపడి బతుకుతున్న వారి పరిస్థితి మరింత దారుణంగా తయారవబోతున్నది. వారు అసలు లెక్క లోనే లేరు. వారి గురించిన ప్రస్తావన లేనేలేదు. ఒక శాస్త్రీయమైన భూవినియోగ విధానాన్ని రూపొందించే ఆలోచన జాతీయస్థాయిలోగాని, రాష్ట్ర స్థాయిలోగాని లేదు. భూములిస్తే కుటుంబానికి ఒక ఉద్యోగం ఇస్తామని ప్రభుత్వం వాగ్దానం చేస్తోంది. దీని అర్థమేమిటి? కుటుంబం మొత్తానికి ఉన్న జీవనభృతిని లాక్కుని అందులో ఒకరికి జీవనభృతి కల్పించటమన్న మాట. ***భూమి మీద ఆధార పడ్డ అనేకనేక సామాజిక తరగతుల సమస్యలను పట్టించుకునే ఆలోచనలే లేవు.***

మొత్తం మీద ఒక విషయం స్పష్టం. చేసిన వాగ్దానాలలో ఏ ఒక్కదాన్నీ నెరవేర్చడం లేదు. మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం రైతులను మరింత దరిద్రులను చేసే విధానాన్ని అవలంబిస్తున్నది. ప్రభుత్వం ఏరకమైన అండ ఇవ్వకుండా వారిని ఉద్దేశపూర్వకంగానే ఏ ఆస్థులను లేని వారిగా మార్చి ఓపక్కకు నెట్టేసే ప్రయత్నం చేస్తున్నది. సరళీకరణ విధానాలను దూకుడుగా అమలు చేస్తూ, నూతన ఆర్థిక విధానాలన్నింటికీ సంపూర్ణ మద్దత్తునిస్తూ రైతుల, వ్యవసాయి కార్మికుల శ్రేయస్సును విస్మరిస్తుంది. వారిని పూర్తగా మోసం చేసి అంబానీ, ఆదానీలకు 'మంచి రోజులు' తెచ్చిపెడుతున్నది.

✡

# ఉపాధి కల్పన-ఉత్త గ్యాసు
## -అన్నీ అబద్ధాలే

- సవేరా

భారత ప్రజలకు మోడీ ప్రభుత్వం నమ్మకద్రోహం చేసింది. ఉద్యోగాలు కల్పిస్తామని చేసిన వాగ్దానాన్ని గాలికొదిలేశారు. సంవత్సరం పాటు సాగించిన ఎన్నికల ప్రచారంలో నరేంద్రమోడీ అందరికీ ముఖ్యంగా యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని వాగ్దానం చేశాడు. మోడీని బిజెపి ఎన్నికల ప్రచారసారథిగా ప్రకటించాక మొదటిసభ 2013ఆగస్టు11న హైదరాబాద్‌లో జరిగింది. ఆనాటి ప్రసంగంలో ఆయన యువతకు ఉద్యోగాలు లేని పరిస్థితి గురించి ఆవేదన వ్యక్తం చేశాడు. ఉద్యోగాలు కల్పించడంలో విఫలమైన కాంగ్రెస్ పార్టీపై నిప్పులు చెరిగాడు. కార్పొరేట్‌విమానాల్లో దేశమంతా పర్యటించాడు. అనేక సభల్లో ప్రసంగించాడు. అధికారంలోకి వస్తే ఉద్యోగాలు కల్పించితీరుతామని హామీ ఇచ్చాడు. 2014 మార్చి2న జరిగిన సభలో ప్రసంగిస్తూ ఇలా అన్నాడు. "మన దేశం పురోగమించాలంటే మన యువత ఆశలకు రెక్కలు తొడగాలి. యువతీయువకులకు సరిపడా ఉద్యోగాలు కల్పించాలి."

ఈ వాగ్దానం పెద్దసంఖ్యలో ప్రజల్ని బిజెపి వైపు ఆకర్షించింది. కారణం అంతకుముందున్న యుపిఎ ప్రభుత్వ పాలనలో ఉద్యోగాల కల్పన దారుణంగా పడిపోయింది. అది ఉద్యోగరహిత అభివృద్ధికాలం. మోడీ ప్రజల నిరాశను గమనించాడు. వారికి ఆశలు కల్పించాడు. ఎన్నికయ్యాక స్వతంత్ర దినోత్సవ సందర్భంగా ప్రసంగిస్తూ భారతదేశం అభివృద్ధి చెందాలంటే ఇంకా ఎక్కువగా ఉద్యోగాలను సృష్టించాలన్నాడు. యువతకు మరిన్ని ఉద్యోగావకాశాలు కల్పించాలంటే వస్తూత్పత్తిరంగాన్ని ముందుకు తీసుకువెళ్ళాలన్నాడు. అందుకోసం మొట్టమొదటి సారిగా ఓ పథకాన్ని మన ముందుచారు.

" ఈ రోజు యువతరానికి మరింత ఎక్కువగా ఉద్యోగాలు కల్పించాలనుకుంటున్నాము. ఆ తర్వాత పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేస్తాం" అని మోదీ ఎర్రకోట నుండి గర్జించాడు. అతని ఉద్దేశం పరిశ్రమలు అభివృద్ధి చెందితే లాభసాటిగా లేని వ్యవసాయం నుండి ప్రజలు

పరిశ్రమల వైపు మళ్ళుతారని. అయితే పారిశ్రామీకరణ ఎలా జరుగుతుంది? పారిశ్రామికీకరణ ఎలా జరగాలి అని ఆగస్టు15న ఆయన చూచాయిగా అన్న మాటకు సమాధానంగా ఒకనెల రోజుల తరువాత సెప్టెంబరు 25వ తేదీన 'మేక్ ఇన్ ఇండియా' అనే పథకాన్ని ఆడంబరంగా ప్రకటించారు. ఈ పథకం ప్రకారం విదేశీ కంపెనీలు మనదేశంలో ఉత్పత్తి కర్మాగారాల్ని నెలకొల్పుతాయి. భారతీయ యువత ఉత్పత్తిలో పాలుపంచుకుంటారు. ఈ ఉత్పత్తులను కంపెనీలు విదేశాల్లో అమ్ముకుంటాయి. మోడీకి ఆప్తులైన ఎన్నారై సలహాదార్లు (ప్రవాస భారతీయులు) ఈ పథకాన్ని కనిపెట్టారు. చిరకాలంగా భారత్‌ను పీడిస్తున్న నిరుద్యోగ సమస్యను ఈ మ్యాజిక్ ద్వారా మాయం చేయవచ్చని వారు చెప్పారు.

సంవత్సరం గడిచింది. మోడీ 18దేశాలు దర్శించాడు. భారత్‌లో పెట్టుబడులు పెట్టమని ప్రాధేయపడ్డాడు. మోడీ మహాశయుని బృహత్పథకం ఆచరణ, ఫలితాలు ఎలా వున్నాయో చూద్దాం.

సిమ్లాలోని లేబర్ బ్యూరో మనదేశంలో ఉపాధి తీరుతెన్నుల గురించి ప్రతి 3మాసాలకు ఒక నివేదిక నిస్తుంది. ఇది పూర్తి సర్వేకాదు. ప్రధానమైన 8పరిశ్రమలను అధ్యయనం చేసి నివేదికను తయారుచేస్తుంది. అవి-1.వస్త్ర పరిశ్రమ, 2.తోలు పరిశ్రమ, 3.లోహ పరిశ్రమ, 4.వాహన పరిశ్రమ, 5.నగలు, 6.రవాణా, 7.కంప్యూటర్ నైపుణ్యం, 8.నేత పరిశ్రమ. ఈ నివేదికలు సమగ్ర అధ్యయనం కాకుండా, శాంపుల్ పద్ధతిలో తయారవుతాయి. ఐనప్పటికీ స్థూలంగా పరిస్థితిని అర్థం చేసుకోవడానికి ఉపయోగపడతాయి. ఈ నివేదికల ప్రకారం 2014లో 4లక్షల20వేల కొత్త ఉద్యోగాలు సృష్టించబడ్డాయి. 2014లో ఎక్కువ భాగం(7నెలలు) మోడీ హయాంలోనే గడిచింది. అంతకు ముందు సం॥ అంటే 2013లో ఏర్పడ్డ కొత్త ఉద్యోగాలు 4లక్షల19వేలు. అది యుపిఏ హయాం. పాత ప్రభుత్వానికి, కొత్త ప్రభుత్వానికి మధ్య తేడా ఏమీ లేదు.

మోడీ మ్యాజిక్ ఏమైందో అర్థం కావడంలేదు. గతంలో కాంగ్రెస్ వాగ్దానాలు చేసింది, నెరవేర్చలేదు. ఇప్పుడు మోడీ హయాంలో కూడా అదే జరుగుతున్నది. భారతదేశంలో ఏటా 120లక్షల మంది యువకులు నిరుద్యోగ సైన్యంలో చేరుతున్నారు. కాని పారిశ్రామిక రంగం కేవలం 4లక్షలు మాత్రమే కొత్త ఉద్యోగాలు కల్పిస్తోంది. మిగిలిన 116లక్షల మంది మాటేమిటి? అనియత రంగంలో దొరికే చిన్నచిన్న ఉద్యోగాలతో సరిపెట్టుకోవడం, తక్కువ జీతాలకు పనిచేయడం, భయంకరమైన పరిస్థితులలో జీవించడం, ప్రమాదకరమైన పని పరిస్థితుల్లో ఏ రక్షణా లేకుండా పని చేయడం, ఆకలి, అనారోగ్యాలకు గురి కావడం లాంటి ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నారు. మోడీ తన ప్రచార కార్యక్రమంలో భారతదేశ దౌర్భాగ్య పరిస్థితి గురించి

**ఇదే మోడీ ప్రభుత్వం సామాజిక సంక్షేమ పథకాల అసల స్వరూపం...**

**మంచి రోజులన్నారు ఎవరికి..?**

*ఎస్సీ.ఎస్టీలకు ప్రభుత్వ రంగంలోనూ, ప్రభుత్వంలోని ఉద్యోగాలలోనూ రిజర్వేషన్‌లు కల్పించాలని నిబంధన ఉన్నప్పటికీ ఉద్యోగాలలో పూర్తి చేయని ఖాళీల సంఖ్య సంవత్సరాల తరబడి పేరుకుపోతున్నది. మానవ వనరుల మంత్రత్వ శాఖప్రకారం 2011 నాటికి భర్తీ చేయని ఈ ఉద్యోగాల సంఖ్య 24779. ఇక దీనికి గిరిజనులతో నింపని భర్తీలు గ్రూప్ ఎ,బి,సి కూడా కలపుకుంటే ఈ సంఖ్య మరింత పెరుగుతుంది.*

*దళితులు, ఆదివాసీలు ప్రభుత్వరంగంలో ఉద్యోగాలు పొందలేకపోవడానికి అనేక కారణాలున్నాయి. ఇందులో కేంద్ర ప్రభుత్వం ఉద్యోగ నియామకాలు, ఆపివేయడం, కొన్ని పోస్టులు తీసివేయడం, గ్రూప్ 'డి'ని తొలగించడం, ఎక్కువగా ఎస్సీ.ఎస్టీలు పనులుచేసే గ్రూప్ డిలోని పనులను ప్రైవేటు వ్యక్తులకు అప్పుజెప్పడం, పి.పి.పిని ఎక్కువగా ప్రవేశ పెట్టడం .... ఇత్యాది .... మరిన్ని వివరాలకు*

**–భారత కమ్యూనిస్టుపార్టీ(మార్క్సిస్టు) 21వ మహాసభ తీర్మానం నుండి**

**http://21congress.cpim.org/resolutins/scst-reservations-privatesector-and-law-scscp-and-tsp-funds.**

మొసలి కన్నీరు కార్చాడు. అందలం ఎక్కాక ఎన్నికల వాగ్దానాలన్నిటినీ తుంగలో తొక్కాడు. కోట్లు ఖరీదు చేసే డ్రస్సులు వేసుకుని ప్రపంచమంతా ఊరేగుతున్నాడు. దేశాధినేతలతో ఫోటోలకు పోజులిస్తున్నాడు. భారతదేశ ప్రజలు తమ బాధలు తాము పడుతూనేవున్నారు.

మోడీ హయాంలో పారిశ్రామిక ఉత్పత్తి పెరిగిందా? ఉద్యోగావకాశాలు పెరిగాయా? 2014- 15సం॥లో పారిశ్రామిక ఉత్పత్తి గత సం॥ కంటే 2.8% పెరిగినట్లు ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. అంతకు ముందటి రెండు సంవత్సరాలతో పోల్చితే ఇది మెరుగే కాని చెప్పుకోదగ్గ పెరుగుదల కాదు.

2013-14 (0.1%) మరియు 2012-13 (1.1%) ఇది ఎక్కువ. ఈ రెండు సంవత్సరాలు యుపిఏ2లో స్తబ్ధతగా ఉన్న రోజులు. కాని అంతకు ముందు అభివృద్ధి రేటుతో పోల్చిచూస్తే ఇది చాలా తక్కువ. అయితే 2.3% ఉత్పత్తి రంగంలో అభివృద్ధి జరిగినా మైనింగ్ రంగం 1.4% మాత్రమే నమోదు చేసుకుంది. ఒక్క విద్యుత్ రంగమే 8% అభివృద్ధి సాధించింది.

గత ఏప్రిల్‌లో ప్రభుత్వ సమాచారమే మన ఎగుమతులు క్షీణిస్తున్నాయని తెలిపింది. ఇందులో ఆశ్చర్యం ఏమీలేదు. దీనికి కారణం పాశ్చాత్యదేశాలు మాంద్యంలో చిక్కుకోవడమే. వాస్తవం ఇలాగుంటే-మోడీగారు వాగ్దానం చేసినట్లుగా విదేశీ కంపెనీలు భారతదేశంలో

ఉత్పత్తి చేయడంగాని, ఆ ఉత్పత్తులను ఎగుమతి చేయడంగాని ఎలా సాధ్యం? సాధ్యం కాదని వాగ్దానం చేసిననాడు తెలియదా?

తాజా రిజర్వుబ్యాంకు సమాచారం ప్రకారం భారతదేశంలోకి విదేశీనిధుల ప్రవాహం పెరిగింది. ఐతే అందులో ఎక్కువ భాగం షేర్‌మార్కెట్‌లోకి ప్రవేశిస్తోంది గాని, ఉత్పత్తి రంగంలోకి కాదు. 2014–15లో 75బిలియన్ డాలర్ల విదేశీనిధులు మన దేశంలోకి వచ్చాయి. అందులో 40బిలియన్‌డాలర్లు (54%) షేర్ మార్కెట్‌కి వెళ్ళిపోయాయి. అంతకుముందు సం॥ 2013–2014లో 22బిలియన్ డాలర్లు విదేశీనిధులు వస్తే 5బిలియన్ డాలర్లు షేర్ మార్కెట్‌కి చేరాయి. కాబట్టి విదేశీ పెట్టుబడుల విషయంలో మోడీ వైఫల్యం స్పష్టమవుతోంది. మోదీ కార్పొరేట్ అనుకూల, పశ్చిమ అనుకూల విధానాలు కేవలం ఎప్పుడంటే అప్పుడు ఎగిరిపోయే పెట్టుబడుదారులనే ఆకట్టుకున్నాయి. ఈ పెట్టుబడుల వలన ఉద్యోగాలు రావు.

ఆయన కార్పొరేట్ అనుకూల, పాశ్చాత్య అనుకూల భాష, భావజాలం నిలకడలేని అనుత్పాదక నిధులను ఆకర్షిస్తున్నాయికాని, ఉద్యోగాలను కల్పించే ఉత్పాదక రంగంలో పెట్టుబడులను ఆకర్షించడంలేదనీ ఆయన అనుయాయులు ఉద్యోగాల గురించి అబద్ధాలు చెప్పడం మానలేదు. ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ ఇటీవల ఇలా అన్నాడు– *'భూసేకరణ బిల్లు అమల్లోకి వస్తే 30కోట్ల ఉద్యోగాలు వస్తాయి.'* మనదేశంలో మొత్తం శ్రామిక జనాభా 46కోట్లు. 30కోట్ల మందికి ఉద్యోగాలు కల్పిస్తారట. ఎలా నమ్మటం? క్రూరమైన భూసేకరణ బిల్లును సమర్థించుకోడానికి వీళ్ళాడుతున్న నాటకం ఇది.

మరోవైపు నిరాధారులైన ప్రజలకు కొంచెమైనా ఊరట కల్గించే ఉపాధి హామీ పథకాన్ని మోడీ ప్రభుత్వం గొంతుపిసికి చంపేస్తున్నది. తాజా సమాచారం ప్రకారం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి 50 రోజుల్లో 2కోట్ల 27లక్షల మంది పని కోసం వస్తే ఒకకోటి 10లక్షల మందికి మాత్రమే పని దొరికింది. వచ్చిన వారిలో సగం మంది వెనుదిరిగారు. రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్రం నిధులు విడుదల చేయకపోవడం దీనికి కారణం. ఇదీ మోదీ గారి నిరుద్యోగ సమస్యను పరిష్కరించే తీరు.

**దేశ, విదేశీ బూర్జువా వర్గ పొగడ్తలతో ముంచెత్తబడుతున్న మోదీ, ఆయన అనుయాయులూ గుర్తించవలసిందేమంటే ఇంతకంటే భారీ మెజార్టీతో వచ్చిన ప్రభుత్వాలను సైతం అసంతృప్తితో, కోపంతో రగిలిన ప్రజలు భూస్థాపితం చేశారు. మోదీ ప్రభుత్వం కూడా అవైపే పరుగులు తీస్తోంది.**

**– భారత కమ్యూనిస్టుపార్టీ (మార్క్సిస్టు) 21వ మహాసభ తీర్మానం నుండి**

# పప్పు ఉప్పు, కూరా నార విలాస వస్తువులే

- శ్యామ్




'మీరు మాకు అంకెలు,లెక్కలు చెబుతున్నారు. అంకెలు పొట్ట నింపవు. ధరలు ఎట్లా వున్నాయో ఇళ్ళకు పోయి మీ భార్యలనడగండి.' భారతీయ మజ్దూర్ సంఘ్ అధ్యక్షులు బి.యన్.రాయ్ మంత్రుల నుద్దేశించి అన్న మాటలు ఎకానమిక్ టైమ్స్ పత్రికలో రిపోర్టు చేయబడ్డాయి. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే ప్రభుత్వంపై విరుచుకుపడ్డ ఈ వ్యక్తి ఈ ప్రభుత్వం రావడం కోసం శ్రమించిన వ్యక్తే. ఒకపక్క ధరలు మండిపోతుంటే, మరోపక్క ప్రభుత్వం అంకెల గారడీతో మభ్యపెట్టే ప్రయత్నం చేస్తుంటే వారి అనుయాయుడే సహించలేక కేకలేశాడు.

అధికారిక సమాచారం ప్రకారం గత సం॥ ఏప్రిల్‌తో పోల్చితే ఈ సం॥ ఏప్రిల్‌లో హోల్‌సేల్ ధరలు 2.7% తగ్గాయి. రిటైల్ ధరలు చూస్తే 4.87% మాత్రమే పెరిగాయని వినిమయధరల సూచిక చెబుతున్నది. మేము ధరల పెరుగుదలను అదుపు చేస్తామన్న వాగ్దానాన్ని నిలబెట్టుకున్నాము, కావాలంటే ఈ అంకెలు చూడండని మోడీ, అరుణ్‌జైట్లీ బృందం దబాయించి మరీ చెబుతున్నది. సామాన్య ప్రజల దైనందిన జీవితానికీ, ఈ లెక్కలకు

ఏమీ పొంతన లేదు. ధరల పరిస్థితి తెలుసుకోవడానికి వారికి ప్రభుత్వ లెక్కలు అవసరం లేదు. వాస్తవ పరిస్థితిని మరుగుపరచే పద్ధతిలో కూడా లెక్కలను, గణాంకాలను తయారుచేయవచ్చు. ఇప్పుడు జరుగుతున్నది అదే.

రెండు రకాల వినిమయ వస్తువులు సమస్యకు కేంద్రంగా వున్నాయి. ఒకటి పప్పులు, రెండు కూరగాయలు. అధికారికంగా వెల్లడించిన టోకు ధరల సూచిక సైతం పప్పుల ధర 15శాతం పెరిగినట్లు అంగీకరించింది. వినిమయధరల సూచిక పప్పుదినుసులు, వాటి ఉత్పత్తుల ధర గత సం॥ కంటే 12.5% ఎక్కువగా వున్నట్లు చెప్పింది. ఐతే వాటి ధరలు పట్టణ ప్రాంతాల్లో 18.3% పెరిగినట్లు కూడా తెలిపింది. ఈ వివరాలే ఆందోళనకరమైన ధరల పెరుగుదలను ప్రకటిస్తున్నాయి. వాస్తవం మరింత తీవ్రంగా వుంది.

| **పప్పులు** | **ఏడాదిలో పెరిగిన ధర** |
|---|---|
| కందిపప్పు | **20 - 38%** |
| మినపప్పు | **22 - 44%** |
| ఎర్రపప్పు | **12 - 55%** |
| పెసర పప్పు | **2 - 53%** |

| **కూరలు** | **ఏడాదిలో పెరిగిన ధర** |
|---|---|
| **టమాటా** | **22 - 265%** |
| **బఠాణీ** | **30 - 39%** |
| **ఉల్లి** | **10 - 57%** |
| **కాలీఫ్లవర్** | **7 - 106%** |

వినియోగదారుల వ్యవహారాలశాఖ ఇచ్చిన సమాచారం పరిస్థితి ఎంతదారుణంగా వుందో చూపుతున్నది. ఐదు ప్రధానమైన పప్పుదినుసుల ధరలకు సంబంధించిన వివరాలను పరిశీలిద్దాం. ఈసందర్భంగా దేశ రాజధానిని, బిజెపి పాలిత రాష్ట్రాల రాజధానులనూ పరిశీలనకు ఎంచుకున్నాం. ఎంచుకున్న నగరాలివి–ఢిల్లీ, ముంబాయి, అహ్మదాబాద్, జైపూర్, భోపాల్. ఇతర పార్టీల కంటే తమది సమర్ధవంతమైన పాలన అని కాషాయ కూటమి చెప్పుకుంటున్నది కాబట్టి వారి పాలన లోని నగరాలనే ఎంచుకున్నాం. కందిపప్పు ధర ఈ అన్ని నగరాల లోను గత సం॥ కంటే ఇప్పుడు 20నుండి 38శాతం వరకు పెరిగింది.

మినప్పప్పు ధర 22నుండి 44శాతం పెరిగింది. ఎర్రపప్పు (మసూర్ దాల్) 12నుండి 55శాతం వరకు పెరిగింది. పెసరపప్పు 2శాతం నుండి 53 శాతం వరకు పెరిగింది. శనగపప్పు విషయంలో చాలా హెచ్చుతగ్గులు కన్పించాయి. ఒకపక్క భోపాల్‌లో ధర తగ్గింది. మరోవైపు జైపూర్‌లో 50శాతం పెరిగింది.కందిపప్పు, మినప్పప్పు, పెసరపప్పు-ఇవన్నీ ఢిల్లీ, ముంబాయిలలో కిలో వందరూపాయలపైన అమ్ముతున్నాయి.

కాయగూరల పరిస్థితికూడా ఇలాగే వుంది. టోకుధరల సూచిక ప్రకారం ఉల్లిపాయల ధర 30% పెరిగింది. మోడీగారి అహ్మదాబాద్‌లో 57శాతం పెరిగింది; కిలో15రూ॥ నుండి 23రూ॥కు ఎగబాకింది. జాతీయ ఉద్యానవన బోర్డువారిచ్చిన లెక్కలివి.

ఉల్లిపాయల ధరలు పైకి పాకుతుంటే, టమాటాల ధరలు తారాజువ్వల్లా ఎగురుతున్నాయి. మనం చూసిన 5 నగరాల్లోనూ టమాటోధర ఈ సంవత్సర కాలంలో 55% (అహ్మదాబాద్) నుండి 265% (భోపాల్) వరకు పెరిగింది. బఠానీల ధరలు 30-39%పెరిగాయి. కాలీ ఫ్లవర్ ధర ఢిల్లీలో రెట్టింపయింది. ఇతర నగరాల్లో కూడా దాదాపు ఇంతే. దేశ రాజధానిలో వంకాయల ధర 70శాతం పెరిగింది.

ఈ లిస్టు చెప్పుకుంటూ పోతే చాంతాడంత వుంది. అసలు రహస్యం ఏమిటంటే-అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు బాగా తగ్గడం వల్ల అధికారిక ధరల సూచికలు, ద్రవ్యోల్బణ సూచికలు కిందకు దిగాయి. ప్రజలకీ సూచికల వల్ల ఏం ప్రయోజనం? రోజువారీ ఆహారపదార్థాల ధరలు పైకెగబాకుతుంటే, ఈ సూచికలను చూసి ఆనందించాలా? కనీస అవసరాల ధరల పెరుగుదల తీవ్రమైన దుష్ఫలితాలకు దారితీస్తుంది. మనదేశంలో ఇప్పటికే తీవ్రమైన ఆహారలోపం వుంది. ఈ సమస్య మరింత పెరిగే పరిస్థితు లొచ్చాయి. మన దేశ జనాభాలో చాలా పెద్దసంఖ్యలో సంప్రదాయిక శాకాహారులున్నారు. ఇతర ప్రజల్లో కూడా మాంసాహారాన్ని వాడేది చాలా తక్కువ(ఖర్చు భరించలేక). అంటే వారు కూడా శాకాహారుల కిందే లెక్క. వీరందరికీ మాంసకృత్తులు లభించేది పప్పులద్వారానే. కాయగూరలు, ఆకుకూరలు, విటమిన్లను, ఖనిజాలను అందిస్తాయి. ముఖ్యమైన పోషకపదార్థాలనందించే ఆహారపు ధరలు పెరిగేకొద్దీ పేద కుటుంబాలు వాటి వినియోగం తగ్గించుకుంటాయి. ఫలితంగా జనాభాలో పెద్దభాగానికి ఆహారలోపం అనే సమస్య తీవ్రమౌతుంది.




పాలకులు ధరలను తగ్గించే చర్యలు తీసుకుంటారని ఆశించుదామా? ప్రభుత్వం వాస్తవాన్ని అంగీకరించడానికి సిద్ధపడినట్లయితే ఏమాత్రమైనా ఆశతో మనం ఎదురు చూడవచ్చు. కాని పాలకులు అసలు సమస్యే లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ద్రవ్యోల్బణం తగ్గించాం, మంచి రోజులు తెచ్చాం అంటూ మంత్రులు ఊరేగుతున్నారు. వీళ్ళు ధరల సమస్యపై దృష్టి పెడతారని ఆశించడానికి అవకాశం వుందా?

✡

# పేదలను ఆదుకునే పథకాలలో కోతలు

*- సురజిత్ మజుందార్*

మోడీ అధికారంలోకొచ్చి సంవత్సరం గడిచింది. అయితే వారు వాగ్దానం చేసిన అద్భుతమైన మార్పులు భారత ఆర్థిక వ్యవస్థలో రాలేదు. ఈ సంవత్సరంలో మోడీ ప్రభుత్వం యొక్క అసలు ఉద్దేశాలు ఏమిటి, వారి విధానాలు ఎవరికి లాభాలు కలిగిస్తాయి- అనే విషయం మాత్రం స్పష్టంగా అర్థమైంది. మోడీకి కావలసినవారు కార్పొరేట్లు గాని సామాన్యులు కాదు అని తేలిపోయింది. బిజెపి ఎన్నికల ప్రచారానికి భారీగా నిధులు సమకూర్చిన బడాబాబుల ఆశలు ఒకవైపు, ఎవరి ఓట్ల కోసం పాకులాడారో ఆ సామాన్యప్రజల ఆశలు మరోవైపు-ఈ పరిస్థితిలో ఎటు మొగ్గుచూపాలి అన్న విషయంలో ప్రభుత్వానికి ఎటువంటి సందిగ్ధత లేదు. ప్రభుత్వ ప్రాధాన్యం సామాన్యుల అవసరాలు తీర్చడం కాదు- కార్పొరేట్ల లాభాపేక్షను తృప్తి పర్చడమే. మోడీ ప్రభుత్వ సామాజిక బాధ్యత ఏమిటో చక్కగా అర్థమౌతోంది. విద్య, వైద్యం, సాంఘిక సంక్షేమం, ఉపాధి హామీ మొదలైన సామాజిక అవసరాలకు పెట్టే ఖర్చులపై ప్రభుత్వం తీవ్రమైన కోతలను విధిస్తోంది.

మోదీ ప్రభుత్వం సంక్షేమ రంగం అయిన విద్య, వైద్యం, సామాజిక భద్రత, ఉపాధిహామీ మొదలైన వాటిపై పాశవికంగా కోతలు విధించింది.

2014-15సం॥లో తొలిసారి సంక్షేమ రంగానికి కోతలు విధించారు. ఈ సంవత్సరం ఈ కోతలను మరింతగా పెంచేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది.

2014 సార్వత్రిక ఎన్నికలకు ముందు అప్పటి ఆర్థిక మంత్రి చిదంబరం ఆపద్ధర్మ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. నూతన ప్రభుత్వం ఆ బడ్జెట్‌ను పెద్దగా మార్చలేదు కాని అంచనాల సమీక్ష, ఖర్చుల కోతలు జరిగాయి. సవరించిన అంచనాల ప్రకారం కేంద్రప్రభుత్వ వ్యయంలో




7శాతం తక్కువగా ఉంది. అయితే ... ప్రభుత్వం ప్రకటించిన తాత్కాలిక లెక్కల ప్రకారం ఈ కోత 9% ఉంది. ఈ కోత ప్రభావం ప్రధానంగా ప్రణాళికా వ్యయంపై పడింది. సవరించిన అంచనాల ప్రకారం 18.62%కోత ఉండగా తాత్కాలిక (ప్రొవిజనల్) లెక్కల ప్రకారం 24.24% కోత ఉంది. ప్రణాళికా వ్యయం సవరించిన అంచనాల కంటే 18.62% తగ్గించబడింది. అయితే కేయింపులు పరిగణనలోనికి తీసుకుంటే ఈ కోత 24.24%గా వుంది. అసలే అంతంత మాత్రం కేటాయింపులు పొందే వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, విద్య, వైద్యం ఇంకా ఇతర సంక్షేమ పద్దులన్నీ మరింత కోతకు గురయ్యాయి. షెడ్యూల్డ్ కులాల సబ్ ప్లాన్‌కు 33.45శాతం, ట్రైబల్ సబ్ ప్లాన్‌కు 37.59శాతం, శిశు సంక్షేమానికి 13.8శాతం కోతలు పడ్డాయి. మహిళా సంక్షేమ పథకాలకు కూడా ఇదేగతి పట్టింది.

2014–15 ఆర్థిక సంవత్సర విధానాలే 2015–16లోనూ అమలు అయి వుండేవి. 14వ ఆర్థిక సంఘం సిఫార్సులను అమలు చేయాల్సివచ్చింది కాబట్టి కేంద్ర ఆదాయంలో రాష్ట్రాలవాటా పెరిగింది. రాష్ట్ర వాటాలకు 2015–16లో కేంద్రకేటాయింపులు పెరిగాయికాబట్టి రాష్ట్రాలు మరింత బాధ్యత తీసుకోవాలన్నమాట. ఒక చేత్తో ఇచ్చి మరో చేత్తో లాక్కోవడం జరిగింది. ఇప్పటి వరకు కేంద్రం బాధ్యత వహిస్తున్న పథకాలను 3గ్రూపులుగా విభజించారు.

1) కేంద్రం మద్దతు పూర్తిగా ఉపసంహరించే పథకాలు, 2) కేంద్రం పూర్తి బాధ్యత వహించే పథకాలు, 3) కేంద్రరాష్ట్రాలు బాధ్యత పంచుకునే పథకాలు. కాని నూరు శాతం నిధులిచ్చే కేంద్ర పథకాలను పరిశీలిస్తే అసలు విషయం బయటపడుతుంది. 2015-16లో వీటి కేటాయింపులు రూ.118512.21 కోట్లుకాగా 2014-15లో ఈ మొత్తం రూ.118537.70కోట్లు అంటే కేటాయింపులు తగ్గాయన్నమాట. అంతే కాగా వాటి నిజ విలువతో చూసినప్పుడు మరింత తగ్గినట్టు లెక్క. మధ్యాన్న భోజన పథకం, జాతీయ గ్రామీణ ఉపాధి పథకం, ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన, అసంఘటిత కార్మికుల సాంఘిక సంక్షేమపథకం వంటి ముఖ్యమైన పథకాలు దెబ్బతిన్నాయి. ప్రధాన సబ్సిడీలలో 10శాతం కోత పడింది. బడ్జెట్ సందర్భంగా ప్రభుత్వం తన మనసులో మాట చెప్పింది: 'ఆర్థిక సుస్థిరత సాధించడం కోసం సబ్సిడీలను తగ్గించుకుంటూ రావడం అత్యంత కీలకం. లబ్ధిదారుల ఎంపిక జాగ్రత్తగా చేయాలి. ప్రభుత్వం సమర్థవంతమైన ఆర్థిక పటిష్టతను సాధించడానికి కూడా సబ్సిడీలను నియంత్రించడం అన్నది ఎంతో ముఖ్యమై అంశం.'

2014-15లో కేంద్రం నిర్వహించి ఇప్పుడు రాష్ట్రాలకు బదలాయించిన పథకాలకు ఖర్చు చేయవలసిన మొత్తం రూపాయలు 1,44,453.24 కోట్లు. ఈ పథకాలను కేంద్రమే అమలుపరిచినప్పటి కంటే ఇది ఎక్కువ. 2015-16లో ఈ పథకాలకు బడ్జెట్ కేటాయింపులు గత సం॥ కంటే 45.8% తగ్గించారు. దీని ఫలితంగా రాష్ట్రాలపై భారం పెరుగుతుంది. ఈ పథకాలను అదే స్థాయిలో అమలు చేయాలన్నా కేటాయింపులు పెంచి ఉండాల్సివుంది. నిజానికి ఈ పథకాల అమలు మరింత పటిష్టంగా అమలు చేయాలంటే నిధులు పెంచవలసిన అవసరం వుంది. కాని కేంద్రం నిధులలో కోతలు విధించింది. ఒకవైపు రాష్ట్రాలకు కేంద్ర ఆదాయంలో వాటా పెంచినట్లే పెంచి మరోవైపు అంతకంటే ఎక్కువగా కేంద్రపథకాలకు కేటాయింపులు తగ్గించడం వల్ల రాష్ట్రాలకు ఆదాయాన్ని మించి ఖర్చుపెరిగింది. ఇప్పటి వరకు కేంద్రం భరించిన ఖర్చును రాష్ట్రాల మీదకు తోసేసింది. 14వఆర్థిక సంఘం సిఫార్సువల్ల రాష్ట్రాలకు జరిగిన మేలును రద్దు చేసింది. ఫలితంగా సమగ్ర శిశుసంక్షేమ పథకం, రాష్ట్రీయ కృషివికాస్ యోజన, జాతీయ ఆహార భద్రతా కార్యక్రమం, ప్రధానమంత్రి కృషి సంచాయ్ యోజన, జాతీయ ఆరోగ్య కార్యక్రమం, జాతీయజీవనోపాధుల కార్యక్రమం, అందరికీ విద్య, అందరికీ ఇళ్ళు పథకాలు-ఇవన్నీ కూలబడే ప్రమాదంలో వున్నాయి.

ఇదిలా వుండగా కేంద్రం ప్రజలను మభ్యపెట్టేందుకు ఇంకా అనేక కొత్త సాంఘిక సంక్షేమపథకాలను ప్రకటించింది. ఈ పథకాలన్నింటి వెనుక వున్నది ఒకేఒక్క పథకం అదే కానీ ఖర్చు చేయకుండా పెద్ద ప్రచారార్భాటం, పటాటోపం. సాంఘిక సంక్షేమ కార్యక్రమాలకు ప్రభుత్వం పన్నుల నుండి వచ్చే ఆదాయం నుండి ఖర్చు చేయటం లేదు. ప్రభుత్వం సామాన్య ప్రజల నుండే ఆ నిధులను సమకూరుస్తుంది. పైగా నష్టాలు వచ్చే పథకాలను ప్రభుత్వం పై నెట్టేసి ప్రయివేటు సంస్థలకు ద్రవ్య మార్కెట్‌లో మరింత ఎక్కువగా ప్రవేశించేందుకు వెసులు బాటు కల్పిస్తున్నది.

*ఇదే మోడీ ప్రభుత్వం సామాజిక సంక్షేమ పథకాల అసలు స్వరూపం...*

*మంచి రోజులన్నారు ఎవరికి..?*

**‘.... షెడ్యూల్డు కులాల, తెగల ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం జనాభాలో వారి నిష్పత్తినిబట్టి యస్‌సిలకు 16.6%, యస్‌టిలకు 8.6% బడ్జెట్‌లో కేటాయించవలసి వుండగా అవసరమైన మొత్తంలో సగం కూడా ప్రభుత్వం కేటాయించడం లేదు. సంవత్సరాల తరబడి ఇలా జరుగుతున్నది. ఈ సంవత్సరం మోడీ ప్రభుత్వం షెడ్యూల్డు కులాల ప్రత్యేక నిదుల్లో రూ. 46,385 కోట్లు కోత విధించింది. గిరిజన సబ్‌ప్లాన్ నిధుల్లో 20వేల కోట్ల రూపాయలు కోత విధించింది. షెడ్యూల్డు కులాల, తెగల ప్రజల మొత్తం సంఖ్య జనాభాలో 25 శాతం వుండగా వారికి కేటాయింపు ఎప్పటికన్నా అతి తక్కువగా 10 శాతానికి పడిపోయింది. 2012-13 2013-14, - ఈ రెండు సంవత్సరాల బడ్జెట్‌లలో వాస్తవంగా ఖర్చుపెట్టిందాన్ని బట్టి చూస్తే, షెడ్యూల్డు కులాల, తెగల ప్రత్యేక కేటాయింపులలో కోత 1.34 లక్షల కోట్ల రూపాయలకు చేరింది ....’**

**http://21congress.cpim.org/resolutins/scst-reservations-privatesector-and-law-scscp-and-tsp-funds.**

# మోడీ తరహా ఆర్థిక తోడ్పాటు

## - ఖాళీ బ్యాంకు ఎకౌంట్లు, ఉత్తుత్తి ఇన్సూరెన్సులు

*- వి.రమేష్*

మోడీ ప్రభుత్వం 'సబ్‌కా వికాస్' అని టముకేస్తోంది. అంటే అందరికీ అభ్యుదయం అని అర్థం. అంటే అది ప్రజలకు గౌరవ ప్రదమైన ఉపాధి కల్పించడం, వారికి ఆదాయాలను పెంచడం ద్వారా కాదు. అందరికీ ఆర్థిక వ్యవహారాల్లో భాగస్వామ్యం కల్పించడం మోదీకి ఈయన అనుయాయీలకూ అభివృద్ధి అంటే బ్యాంకు ఖాతాలు తెరవడం. భీమా పొందడం. ఇది సులువయిన పని. పేదప్రజల జేబులోవున్న పదీ పరకా బ్యాంకుల్లో పడేస్తే, అదంతా కలిసి కార్పొరేట్లకు పెట్టుబడిగా ఉపయోగపడుతుంది. పైగా సామాన్యులు అభివృద్ధిలో భాగస్వాములైనట్టు భ్రమ కలుగుతుంది. మన దేశంలో 5గురు సభ్యులున్న కుటుంబానికి నెలసరి వినిమయఖర్చు గ్రామాల్లో 7వేలరూ।।, పట్టణాల్లో 13వేలరూ।। అవుతుందని జాతీయ శాంపుల్‌సర్వే సంస్థ నివేదికలో తెలిపారు. ఒక వ్యవసాయకార్మికుడి ఆదాయం నెలకు 6వేల లెక్కన సంవత్సరంలో ఆరుమాసాలు మాత్రమే వుంటుంది. అదే మహిళా వ్యవసాయకార్మికులకైతే నెలకు 5వేల లెక్కన సంవత్సరంలో నాల్గుమాసాలు మాత్రమే వుంటుంది. (లేబర్‌బ్యూరో సర్వే నివేదిక ప్రకారం) వాస్తవం ఇలా వుంటే, మీరు బ్యాంకుల్లో డబ్బు వేయండి, భీమా పాలసీలు తీసుకోండి, సెల్‌ఫోన్ల ద్వారా మీరు లావాదేవీలు చేసుకోవచ్చు అనటం క్రూరమైన హాస్యం.

ఈ రకమైన ఆర్థిక అభివృద్ధిలో సామాన్యులను భాగస్వాములను చేసే మోసాన్ని కాసేపు పక్కన పెట్టి మోడీ ప్రభుత్వం కొత్తగా ప్రవేశ పెట్టిన భీమా, పెన్షన్, పథకాలను, వీటికి అనుసంధానంగా జనదన్ యోజనాపేరుతో బ్యాంకులలో తెరిచిన సున్నా బ్యాలెన్సు ఖాతాలను పరిశీలిద్దాం.

2015, మే 9న ప్రధాని మోడీ మూడు సాంఘిక భద్రతా పథకాలను ఎంతోఆర్భాటంగా ప్రకటించారు. అవి: 1.ప్రధానమంత్రి జీవనజ్యోతి భీమాపథకం, 2. ప్రధానమంత్రి సురక్ష భీమా పథకం, 3.అటల్ పెన్షన్ పథకం. బడ్జెట్ ప్రసంగంలో ఆర్థికమంత్రి ఈ పథకాలను ఆకాశానికెత్తాడు. బడ్జెట్‌లో అటల్ పెన్షన్ పథకానికి కొంత కేటాయింపు చేశారుగాని, మిగతా రెండు పథకాలకు ఏమాత్రం మద్దతులేదు. ఈవిషయం ఆర్థికశాఖ కార్యదర్శి స్పష్టం చేశారు. ఈ మూడు పథకాలను ప్రధానమంత్రి దార్శనికతకు దర్పణంగా చూపిస్తున్నారు. ఈ పథకాల తీరు తెన్నులు చూద్దాం.

1. ప్రధానమంత్రి జీవనజ్యోతి భీమాపథకం: 18సం॥-50సం॥ మధ్య వయసున్న వారు ఈ పథకంలో చేరవచ్చు. ఐతే ముందు సేవింగ్స్‌బ్యాంక్ ఖాతా వుండాలి. ఈ పథకానికి ఏటా ప్రీమియం 330రూ॥ చెల్లించాలి. జీవితభీమా 2లక్షల రూ॥ వుంటుంది. 330రూ॥ కట్టి ఏడాదిలోపు చనిపోతే కుటుంబానికి 2లక్షలు భీమాసొమ్ము వస్తుంది. చనిపోకపోతే ఏటేటా మళ్ళీ రూ. 330 కట్టాలి. ఇలా కట్టినందుకు ప్రతిఫలంగా ఒక్క రూపాయికూడా ప్రీమియమ్ చెల్లించినవాడికి తిరిగిరాదు. బతికున్నందుకు ఏటా రూ. 330 పన్ను కట్టినట్లుగా వుంది. పైగా ఇన్సూరెన్సు కంపెనీలు ఈ ప్రీమియం చాలాతక్కువగా వుందని అసంతృప్తిగా వున్నట్లు సమాచారం. భీమా చెల్లింపుల అనుభవాన్ని చూసి ప్రీమియంను పెంచే అవకాశం వుంది. ఇక్కడ చెల్లింపులే గనక ఎక్కువయితే ఆ నష్టాన్ని భీమాకంపెనీలు భరించవు కదా!

2. ప్రధానమంత్రి సురక్షభీమా పథకం: 18-70సం॥ మధ్య వారికి ఈ పథకం వర్తిస్తుంది. బ్యాంకుఖాతా వుండాలి. ఇది ప్రమాదభీమా పథకం. ప్రీమియం ఏడాదికి 12రూ॥ కట్టాలి. ప్రమాదంలో మరణిస్తే 2లక్షలరూ॥ భీమా చెల్లిస్తారు. అంగవైకల్యానికి ఒక లక్ష ఇస్తారు. ప్రీమియం మరీ తక్కువంటున్నారు. వచ్చేఏడు పెంచవచ్చు. ఇక్కడ చెల్లింపులే గనక ఎక్కువయితే ఆ నష్టాన్ని భీమాకంపెనీలు భరించవు కదా!

ఈ రెండూ సార్వజనీన పథకాలుకావు. ఎందుకంటే ఇవి బ్యాంకుఖాతాదారులకే పరిమితం. ఈ పథకాలకు ప్రభుత్వం నుండి ఆర్థికతోడ్పాటు ఏమాత్రం వుండదు. వీటిని ప్రభుత్వం నడిపే సాంఘికభద్రతా కార్యక్రమాలుగా చెప్పుకోవడం సరికాదు. భారతప్రజల్లో సగంమందికి బ్యాంకు ఖాతాలు లేవు. మన జనాభా 125కోట్లకుగాను, 68కోట్ల బ్యాంకు ఖాతాలున్నాయని రిజర్వుబ్యాంకు తెలిపింది. అంటే 68కోట్లమందికి బ్యాంకు ఖాతాలున్నాయని కాదు. ఒకటి కంటే ఎక్కువ ఖాతాలున్న వ్యక్తులుంటారు. కాబట్టి ఖాతాదారుల సంఖ్య 68కోట్ల కంటే తక్కువ వుంటుంది. ఎన్ని ఖాతాలున్నా ఒక్క ఖాతాకు మాత్రమే ఈ సౌకర్యం వర్తిస్తుంది. బ్యాంకు ఖాతాలకు సంబంధించి దేశంలో వివిధ ప్రాంతాలమధ్య తేడాలున్నాయి.

దక్షిణభారతంలో 66శాతం ప్రజలు బ్యాంకుసేవలు వాడుకుంటున్నారు. తూర్పుభారతంలో 30శాతం మాత్రమే. ఈ సౌకర్యాలను వినియోగించుకోగలుగుతున్నారు.

ఈ మధ్యనే 'ప్రధానమంత్రి జన-ధన యోజన' అనే పథకం కింద 12కోట్ల ఖాతాలు తెరవబడ్డాయి. వీటిలో 74శాతం సున్నా బ్యాలన్సుతోనే వున్నాయి. భీమా పథకాలు వర్తించాలంటే బ్యాంకు ఖాతాల నుండే ప్రీమియమ్‌ను చెల్లించాలి. సున్నా బాలెన్స్ ఉన్న ఖాతాలనుండి ప్రీమియమ్ చెల్లించక పోవడం వలన ఇంతమందికీ ప్రధానమంత్రి జీవనజ్యోతి భీమాపథకం, ప్రధానమంత్రి సురక్ష భీమా పథకం లేనట్లే. ఇప్పటివరకు అందిన సమాచారం ప్రకారం ప్రమాదభీమా పథకంలో 5కోట్ల మంది, జీవితభీమా పథకంలో 2కోట్ల మంది చేరారట. జీవనజ్యోతి (జీవితభీమా) పథకానికి 75శాతం మేరకు ఎల్‌ఐసి బాధ్యత వహిస్తోంది. మిగిలింది ఎస్‌బిఐ లైఫ్, స్టార్ యూనియన్ డైబీ లైఫ్ అనే ప్రైవేటు సంస్థలు చూస్తాయి. ప్రమాదభీమా విషయానికొస్తే ప్రభుత్వరంగ జనరల్ ఇన్సూరెన్సు కంపెనీలు బాధ్యత తీసుకున్నాయి. ప్రైవేటు ఇన్సూరెన్సుకంపెనీలు ఉత్సాహం చూపలేదు. వాళ్ళు గట్టు మీదనుండి చూస్తున్నారు. ఈ సంవత్సరం అనుభవం చూసి బాగుంటే దిగుతారు.

చివరిగా మనం గమనించవలసింది ఏమిటంటే ఈ పథకాలేవీ సార్వజనీనం కాదు. ఇందులో ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయం ఏమీ లేదు కాబట్టి ఇవి ప్రభుత్వ పథకాలని చెప్పలేము. ఇటువంటి భీమా సౌకర్యం బ్యాంకు ఖాతాదారులకు ఇంతకు ముందు కూడా ఉంది. కాకపోతే ప్రీమియమ్ మరికాస్త ఎక్కువ ఉండేది. అందువలన ఇవి కొత్త పథకాలని కూడా చెప్పలేము.

2007లో యుపిఏ-1 ప్రభుత్వం 'ఆమ్ ఆద్మీ భీమా యోజన' అనే పేరుతో భూమిలేని గ్రామీణపేదలకు ఒక భీమా పథకాన్ని ప్రవేశపెట్టింది. సహజ మరణానికి 30వేలరూ॥, ప్రమాదంవల్ల మరణానికి 75వేలరూ॥ చెల్లించిందా పథకం. దానికి ప్రీమియం కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు చెరిసగం చెల్లించాయి. ప్రజలనుండి ఏమీ వసూలు చేయలేదు.

3. అటల్ పెన్షన్ పథకం: 18-40సం॥ మధ్యవారు ఈ పథకానికి అర్హులు. 60సం॥ నిండిన తరువాత పెన్షన్ ప్రారంభమౌతుంది. పెన్షన్ ఎంత అనేది వ్యక్తి ఖాతాలో ఆదాచేసుకున్న మొత్తాన్ని బట్టి వుంటుంది. వ్యక్తి మరణించాక పెన్షన్ జీవితభాగస్వామికి కొనసాగుతుంది. వారుకూడా మరణిస్తే ఆదా చేసిన మొత్తంసొమ్ము వారసులకిస్తారు. ఈ పథకంలో వ్యక్తి పొదుపుచేసిన డబ్బుకు ప్రభుత్వం 50% ప్రోత్సాహకంగా కలుపుతుంది. ఇది సం॥కి వెయ్యి రూ॥కి మించదు. ప్రభుత్వ మద్దతు 5సం॥ పాటు వుంటుంది. 31.12.2015లోపు పథకంలో చేరే వారికి మాత్రమే ప్రోత్సాహక మద్దతు లభిస్తుంది.

అటల్ పెన్షన్ పథకం గతంలోవున్న స్వావలంబన పథకం స్థానంలో వచ్చింది. ఆ పథకంలో ప్రభుత్వమద్దతు స్థిరంగా ఏటా వెయ్యిరూ॥చొప్పున మూడేళ్ళపాటు వుండేది.

అటల్ పెన్షన్ పథకం ఒక రికరింగ్ డిపాజిట్ స్కీము లాంటిది. పెన్షన్ అర్హత రాకముందే వ్యక్తి చనిపోతే వున్న బ్యాలన్సు సొమ్ము మాత్రమే వ్యక్తి కుటుంబానికిస్తారు. మనకందిన సమాచారం ప్రకారం ఇప్పటివరకు కేవలం 50వేల మంది మాత్రమే ఈ పథకంలో చేరారు. ఈ పథకానికి కూడా ప్రీమియమ్ ఖాతా నుండి పంపవలసిందే.

చివరగా చెప్పేదేమిటంటే ఈ మూడు పథకాలు స్వతః సిద్ధంగానే అశేష ప్రజానీకాన్ని పథకాల బయట వదిలి పెట్టేవే కాని ఇముడ్చుకునేవి కావు. ఇవేవి మనదేశ ప్రజలకి అవసరమైన సార్వజనీన సాంఘిక భద్రతనిచ్చే పథకాలు కానేకావు.

✡

# మహిళలను అణచివేసే తిరోగమన భావజాలం

## - మనువాదుల మాయాజాలం

**- ఇషితా ముఖర్జీ**

మోడీ పాలనలో భారతీయ మహిళల పరిస్థితులెలా వున్నాయి? ఈ ప్రభుత్వం పెట్టుబడిదారులకు ఊడిగంచేస్తూ ప్రజలకు మాత్రం వాగ్దానాలు, ప్రకటనలను గుప్పిస్తున్నది. దేశాన్నేలుతున్న ఈ కొత్త ప్రభుత్వ హయాంలో భారతీయ మహిళకు స్థానమే లేదు. లింగ వివక్షత అనే పునాదిపైనే ఈ ప్రభుత్వం నిలబడివుంది. మహిళల పట్ల వివక్ష ఒక ముఖ్యమైన భాగం. పితృస్వామ్యాన్ని ఎదిరించే పోరాటం భారత ప్రజాస్వామ్యంలో ఎప్పటినుంచో జరుగుతోంది. కాని మోదీ ఈ ఏడాది పాలన భయంకరమైన పితృసామ్య భావజాలం, నయా ఉదారవాద విధానాలకు తోడుగా ముందెన్నడూ ఎరుగనంత చేదైన లింగ వివక్షత అనుభవాలనూ రుచి చూపించింది. అధికారంలోకి వచ్చినవెంటనే ఈ ప్రభుత్వం అనేక వాగ్దానాలను గుప్పించింది. మోడీ ప్రధానమంత్రి కావడానికి ముందు ముఖ్య మంత్రిగా పరిపాలించిన గుజరాత్‌లో అనుభవాలు అందుకు భిన్నంగా ఉన్నాయి. స్త్రీ పురుష నిష్పత్తి పడిపోయింది. స్త్రీ విద్య నిర్లక్ష్యానికి గురైంది. మహిళా స్వావలంబన దెబ్బతిన్నది. మొత్తంమీద మహిళాభ్యుదయం పట్ల ఏమాత్రం ఆసక్తిలేదని గుజరాత్‌లో మోడీపాలన నిరూపించుకుంది. అటువంటి మనిషి దేశ ప్రధాని అయ్యాక మరింత చెడ్డ అనుభవాలు దేశమంతా విస్తరించబడ్డాయి.

పార్లమెంటులో మహిళల రిజర్వేషన్ల సంగతి ఏమైంది? మహిళా రిజర్వేషన్ బిల్లు గురించి 18సం॥గా భారత రాజకీయాలు మల్లగుల్లాలు పడుతున్నాయి. బిజెపి ప్రతిపక్షంలో వున్నప్పుడు బిల్లుకు అనుకూలంగా మాట్లాడింది. అధికారంలోకి వచ్చాక దాని ఊసెత్తడంలేదు. మహిళాసమస్యల పట్ల ఈ ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని అర్థమౌతోంది. బిల్లును జాగ్రత్తగా పరిశీలించిన తరువాత సభలో ప్రవేశపెడతామని మోడీగారు సెలవిచ్చారు. జాగ్రత్తగా పరిశీలించడమంటే అటకెక్కించటం అని మనం అర్థం చేసుకోవాలి. రాజకీయాలలో మహిళల

పాత్ర విషయంలో ఈ ప్రభుత్వానికేమాత్రం ఆసక్తి లేదు. సామాజిక బాధ్యతల నుండి ప్రభుత్వం తప్పుకునే క్రమంలో భాగంగా స్త్రీ, శిశు సంక్షేమశాఖకు నిధులను కోసి పడేశారు. సంబంధిత మంత్రివర్యులు తన శాఖకు కేటాయింపులు, సగానికి తగ్గించడంపై రెండుసార్లు ఆర్థిక మంత్రిత్వశాఖకు లేఖలు వ్రాసారు. పార్లమెంటులో చర్చ సందర్భంగా కోతలు దారుణంగా వున్నాయని వామ పక్షాలు విమర్శిం చినప్పుడు సదరు మంత్రిగారే బడ్జెట్‌ను సమర్థించుకొచ్చారు. ఇప్పుడు వాస్తవాన్ని ఎదుర్కోవడం ఎలాగో మంత్రిగారికి అర్థం కావడంలేదు. ఎందుకంటే నిధుల లేమితో ఆశాఖ ఉన్నా లేనట్లే అయింది. ఈ రోజు దేశంలో మహిళల దీన స్థితికి ఇదో కారణం.




ఇక్కడొక తమాషా జరుగుతున్నది. ఒకవైపు ప్రధానమంత్రి 'ఆహారకొరత లేని భారత్' అనే ఆశయాన్ని ప్రకటించారు. మరోవైపు సమగ్రశిశుసంరక్షణ పథకం నిధుల్లో 10.9వేలకోట్ల రూ॥ కోత పడింది. ఈప్రభుత్వానిది రెండు నాల్కల విధానం కాదా? అలాగే మధ్యాన్నభోజనపథకం నిధులు కూడా కోతకు గురయ్యాయి. 7067 పనిలో ఉన్న ఐసిడియస్ ప్రాజెక్టులు, 13.42లక్షల అంగన్‌వాడీ కేంద్రాలు మూతబడే పరిస్థితి వచ్చింది. రెవెన్యూ ఆదాయం పెరిగితే ఈ కార్యక్రమాలకు పెంచే అవకాశం వుండొచ్చని బడ్జెట్‌లో పేర్కొన్నారు. గ్యారంటీ మాత్రం లేదు. అంగన్‌వాడీ వర్కర్లు, మధ్యాన్న భోజనపథకంలో పనిచేసేవారు, మహిళా సమాఖ్య పనివారు పనికోల్పోయే ప్రమాదంలో పడ్డారు. ఇందులో ఎక్కువమంది మహిళలే.

ప్రభుత్వం ఇంకో గొప్ప నినాదాన్నిచ్చింది. 'ఆడపిల్లల్ని రక్షించండి, ఆడపిల్లల్ని చదివించండి' అనే పిలుపు నిచ్చారు. ఇది నినాదంగానే మిగిలిపోయేటట్లున్నది. ఈ ప్రభుత్వం వ్యాపారప్రకటనల శైలిలో ప్రజల మనసుల్లో భ్రమలు కల్పించే కృషి చేస్తున్నది. ఒక నినాదాన్ని ఆర్భాటంగా ప్రకటిస్తారు, ప్రకటనకు ఆచరణకు పొంతన ఉండదు. బాలికలవిద్యకు కేటాయింపు 8.3%తగ్గించారు. కేవలం వందకోట్లే కేటాయించారు. ఇది ఏమాత్రం చాలదు.

ఈ కార్యక్రమం ఉద్దేశం: భ్రూణహత్యల నివారణ, ఆడపిల్లల్ని చదివించడం, ఎదుగుతున్న ఆడపిల్లల పట్ల శ్రద్ధవహించడం. ఈకార్యక్రమానికయ్యే ఖర్చు మాత్రం రాష్ట్రాలే భరించాలట. ప్రచారం వరకు కేంద్రం చేస్తుంది. రాష్ట్రాలు ఇప్పటికే ఎంతో ఆర్థికవత్తిడిలో వున్నాయి. కాబట్టి ఈ పథకం అటకెక్కుతుందనడంలో అనుమానమే లేదు.

ఈ రాజకీయ సయ్యాటలో కుతంత్రం మనకు స్పష్టంగా కనిపిస్తూనే ఉంది. ఒకవైపు ప్రజాభిమానాన్ని పోగుచేసుకునే ఉద్దేశంతో ప్రధాని మహిళాభ్యుదయానికి అంకితమైనట్లుగా మీడియా ద్వారా ప్రచారం చేసుకుంటున్నారు. మరోవైపు బడ్జెట్ కోతల ద్వారా వివక్ష మరింత తీవ్రతరం చేస్తున్నారు. ఆచరణలో లోపాలవలన, ఫలితాలు రాలేదని నిందను రాష్ట్రాల మీదకు తోసివేయవచ్చు. ఇదీ ఆట.

మోదీ ప్రభుత్వం అంతటితో ఆగలేదు. స్త్రీ పురుష సంబంధాల సమస్యలను రాజకీయలబ్ధి కోసం వాడుకునే నీచానికి బిజెపి దిగింది. కులం, వర్ణం, సామాజిక వర్గం లాంటి తేడాలేం చూపకుండా అన్నింటా ఈ ప్రభుత్వం లింగ వివక్షతను తన రాజకీయ ప్రచారాలకు ఉపయోగించుకోవడం దీనికొక ఉదాహరణ. ఈ విషప్రచారంవల్ల భారతదేశంలో ఒక స్త్రీ తన జీవితభాగస్వామిని స్వేచ్ఛగా ఎన్నుకునే హక్కును కోల్పోతున్నది. పాలకులు మతాంతరవివాహాలకు వ్యతిరేకంగా ప్రచారంచేస్తున్నారు. మహిళ స్వేచ్ఛగా, గౌరవంగా బతికే హక్కును నిరాకరిస్తున్నారు. మహిళలు కుటుంబానికే పరిమితమని నిర్దేశిస్తున్నారు. ప్రభుత్వాలు మరుగు దొడ్లుకట్టుకునేందుకు ఇచ్చే ప్రకటనలలో సహితం స్త్రీలు మరుగు దొడ్లను శు భ్రతకోసమో, ఆరోగ్యం కోసమో వాడాలని చూపకుండా కేవలం ఇంటి నుండి బయటకు వెళ్ళాల్సిన అవసరం కలగకుండా ఉండాలని, అందుకే మరుగు దొడ్లు వాడాలని చూపుతున్నారు. వారి స్థానం ఇంట్లోనే–వారు బయటకు రాకూడదు.

మహిళలకు ఉద్యోగాలు తగ్గిపోతున్నాయి. స్త్రీ పురుష కార్మికుల మధ్య వేతనాల అంతరాలు పెరుగు తున్నాయి. మహిళల పనిపరిస్థితులు ఘోరంగా తయారవుతున్నాయి. మహిళలు వివక్షకు గురవుతున్నారు. రుణ సదుపాయం, సాంఘిక భద్రతలకు దూరమౌతున్నారు. మహిళలెదుర్కొంటున్న సమస్యల పట్ల ప్రభుత్వం ఏ మాత్రం శ్రద్ధ చూపడం లేదు. మహిళలకు ఉపాధి హక్కు, సాంఘికభద్రత హక్కులకు సంబంధించి ఈప్రభుత్వానికి ఒక విధానమంటూ లేదు.

'నిర్భయ నిధి' అనే దాన్ని హింసకు గురైన మహిళ కోసం ఏర్పాటుచేశామన్నారు. ఇది పేరుకే నిధిగాని, కేటాయింపులేమీ లేవు. మహిళలను రక్షించే బాధ్యత కుటుంబానిదేకాని, రాజ్యానిది కాదనే తిరోగమనవాదాన్ని పాలకపక్షం అవలంబిస్తోంది. భ్రూణహత్యలు, శిశు

హత్యలు, ఆహారలోపం, విద్యావైద్య సదు పాయాల కొరత, బాల్యవివాహాలు, లైంగిక వేధింపులు, లైంగిక హింస, మానభంగాలు, యాసిడ్ దాడులు, గృహ హింస, వరకట్నమరణాలు, సెక్సు వ్యాపారంలో చిక్కుకుపోవడం, అంగవైకల్యం, గౌరవ హత్యలు దేశవ్యాప్తంగా పెచ్చరిల్లిపోతున్నాయి. ఈ దౌర్భాగ్య పరిస్థితికి అనుకూలమైన వాతావరణాన్ని రాజ్యం కల్పిస్తోంది. రక్షణ కోసం చట్టాలున్నాయి. వాటిలో ఏఒక్కటీ ఈ ప్రభుత్వం ఏర్పాటుచేసింది లేదు. కనీసం ఆ చట్టాల అమలుకు ప్రస్తుత ప్రభుత్వం తోడ్పడే ప్రయత్నం కూడా ఏమాత్రం చేయడం లేదు.

✡

# కాషాయీకరణ - ఉన్మాదమూకల విజృంభణ

- సుభాషిణీ అలీ

మోడీ సంవత్సర పాలన దేశాన్ని కాషాయీకరించడం కోసం విరామం లేని కృషిచేసింది. ఈ కృషి సమాజంలోని అన్ని రంగాలనూ తాకింది. మన దేశాన్ని హిందూరాజ్యంగా ఆవిష్కరించడానికి దృఢనిశ్చయంతో వున్నారనడంలో ఎటువంటి సందేహం అక్కరలేదు.

దీనానాథ్‌బాత్రా అనే ఆరెస్సెస్ (రాష్ట్రీయస్వయంసేవక్‌సంఘ్) కార్యకర్త 'శిక్షాబచావో ఆందోళన్' (విద్యను రక్షించండనే ఉద్యమం) స్థాపించి ఈ దిశగా గొప్ప కృషిచేస్తున్నాడు. 2014 ఎన్నికలకు ముందే ఈయన ఒకవిజయాన్ని సాధించాడు. వెండీ డోనిజర్ అనే ప్రముఖరచయిత్రి,పరిశోధకురాలు రచించిన 'హిందువులూఒక ప్రత్యామ్నాయ చరిత్ర' అనే పుస్తకాన్ని ప్రచురణకర్తలు (పెంగ్విన్ సంస్థ) మార్కెట్ లోంచి తీసివేసేవరకు యుద్ధం చేశాడు. ఈయన విజయానంతరం ఓరియంట్ బ్లాక్‌స్వాన్ అనే ప్రచురణసంస్థకు లీగల్ నోటీసులు పంపాడు. ఈయన దెబ్బకు వారు 5పుస్తకాల ప్రచురణ నిలిపివేశారు. అందులో ఒక పుస్తకం పేరు '1969 నుండి అహ్మదాబాద్‌లో మతోన్మాదం, లైంగిక హింస'. ఈపుస్తకాన్ని రోడ్స్ స్కాలర్ అయిన మేఘా కుమార్ రచించారు. మానవవనరులశాఖ దీనానాథ్ బాత్రాను పాఠ్యపుస్తకాలకు నిర్ణయాధికారిగా గుర్తించింది. విచిత్రమేమిటంటే బాత్రాగారి చరిత్రజ్ఞానం దయనీయం అయినా. ఈయన రాసిన పాఠ్యగ్రంథాలను గుజరాత్ ప్రభుత్వం ఆమోదించింది. ఈయన పుస్తకాలు జాతి దురహంకార భావాలు, మహిళలను కించ పరిచే భావాలతో నిండి వుంటాయి. ఈయన అమెరికాలోని నల్లజాతి వారినుద్దేశించి అవమానకరమైన, ద్వేషపూరితమైన వ్యాఖ్యలు చేశాడు. ఈ మహానుభావునికి హిట్లర్ అంటే ఎంతోఆరాధన.

ఈ కాలంలోనే శ్రీమతి లీలాశామ్సన్ అధ్యక్షతన పనిచేస్తున్న సెన్సార్‌బోర్డు ప్రభుత్వజోక్యానికి నిరసనగా మొత్తంగా రాజీనామా చేసింది. ఇంకేంకావాలి? బోర్డును బిజెపి అనుయాయులతో నింపేశారు. ఇక చూడండి– ముజఫర్‌నగర్‌లో జరిగిన మతఘర్షణ గురించి

తీసిన 'ఇన్ డినాన్ ముజఫర్‌నగర్' అనే సినిమాకు నూతనబోర్డు అనుమతించలేదు. సినీనిర్మాతలు అనేకరకాల వేధింపులను, అడ్డగోలు జోక్యాన్ని ఎదుర్కొంటున్నారు.

హిందూత్వ ప్రణాళిక మూలసూత్రం హిందూసమాజాన్ని ఏకం చేయడం. హిందూమతాన్ని అంబేద్కర్ తిరస్కరించాడు. ఆయన్ను దళితులు ఎంతగానో ఆరాధిస్తారు. ఈ రెండూ సంఘ్‌పరివార్‌కు ప్రతికూలాంశాలు. దళితుల సామాజిక స్థితి యధాతథంగా వున్నా ఆ విషయాన్ని పట్టించుకోకుండా వారు హిందూమతాన్ని ఆమోదించేలా చేయడంఎలా? ఇది సంఘ్‌పరివార్ తీసుకున్న సవాల్. ఈ సమస్యను అధిగమించడం కోసం కుయుక్తులు పన్నుతున్నారు. సామ దాన భేద దండోపాయాలను ప్రయోగిస్తున్నారు. అందులో ఒకటి దళితులు, ముస్లింల మధ్య శతృత్వాన్ని రెచ్చగొట్టడం, తద్వారా దళితులు హిందువులగా గుర్తించేటట్టు అంగీకరింపచేయడం సంఘ్‌పరివార్ ఆశించే ఫలితం. ఈ పథకానికి అనుగుణంగా కార్యక్రమాలు కొత్త ప్రభుత్వం రాగానే మొదలయ్యాయి. రెండోప్లాను ఇలావుంది–కొన్ని తరాలకిందటే మతం మారిన దళితులను తిరిగి హిందువులుగా మారండని ఆహ్వానిస్తున్నారు. దీనికి 'ఘర్ వాపసీ' అని పేరుపెట్టారు. ఇక మూడోప్లాను–ఇది దండోపాయం. ముస్లింలు, క్రైస్తవుల ప్రార్ధనాస్థలాలపై దాడులు జరపడం దీనిలో భాగం. భారతదేశంలో ముస్లింలకు, క్రైస్తవులకు చోటు లేదని, వారిక్కడ వుండాలంటే హిందువులుగా మారాల్సిందేనని అధికారపార్టీ పార్లమెంటు సభ్యులు, సంఘ్ పరివార్ నాయకులు బహిరంగంగా హెచ్చరిస్తున్నారు. కొందరైతే హిందూమహిళలు ఎక్కువమంది కొడుకుల్ని కనాలని, ముస్లిం, క్రైస్తవ మహిళలు అసలు పిల్లల్నే కనకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. శివసేన పార్లమెంటు సభ్యుడొకాయన ముస్లింలకు, క్రైస్తవులకు ఓటుహక్కు రద్దుచేయాలని డిమాండు చేశాడు. ఇంకా ఘోరంగా మాట్లాడుతున్నారు. హిందూ పురుషులు ముస్లిం స్త్రీలను లొంగదీసుకుని గర్భవతుల్ని చేయాలట.

2014 సెప్టెంబరులో సంఘ్ అధినేత మోహన్ భగవత్ 3పుస్తకాలను ఆవిష్కరించాడు.ఆ పుస్తకాల పేర్లు 1.హిందూ చర్మకారజాతి, 2.హిందూ కటికజాతి, 3.హిందూ వాల్మీకిజాతి. ఈ పుస్తకాల రచయితలు ఆరెస్సెస్ వారే. చరిత్రను వక్రీకరించడంలో ఎంతో ప్రతిభను ప్రదర్శించారు. ఈ పుస్తకాల ద్వారా వీరు చెప్పేదేమిటి? ముస్లిం చొరబాటుదారులు హిందువులలో కొంతమందిని లొంగదీసుకుని వారితో గోహత్యలు, తోలు వలవడం లాంటి పనులు నిర్బంధంగా చేయించారని, ఈవిధంగా చర్మకారులనే కులాన్ని సృష్టించారని చెబుతున్నారు. భారతదేశానికి ముస్లింలు రాకముందు ఇక్కడ పందులనే జంతువులు లేవట,అవికూడావారితోపాటే వచ్చాయట.

ఉన్నతవిద్యారంగంలో చాలాపెద్ద విధ్వంసకాండ జరుగుతున్నది. ఆరెస్సెస్ భక్తులైన కుహనాశాస్త్రవేత్తలు చెలరేగిపోతున్నారు. భారతదేశంలో పురాతనకాలంలోనే విమానాలను, ఆటంబాంబులను కనిపెట్టారని, మొదటి ప్లాస్టిక్ సర్జరీ ఇక్కడే జరిగిందని, వినాయకుడే దానికి రుజువని, కృత్రిమ ఫలదీకరణ, పిండోత్పత్తి ఆనాడే మన వాళ్ళు చేశారని నదురు-బెదురు లేకుండా సైన్సు వేదికలపై పేలుతున్నారు. భారతీయ చరిత్ర పరిశోధన మండలికి అధిపతిగా డా॥వైపియస్ రావు అనే ఆయన్ను ప్రభుత్వం నియమించింది.ఆయన అఖిలభారత ఇతిహాస సంకలన యోజన అనే ఆరెస్సెస్ అనుబంధసంస్థను నడుపుతున్న వ్యక్తి. చరిత్రలో భారతరామాయణాల స్థానాన్ని నిరూపించడం కోసం ఆయన పరిశోధన చేస్తున్నాడట. కుల వ్యవస్థకు గట్టి మద్దతుదారుడు. చరిత్ర పరిశోధనమండలిని రావుగారి చేతిలో పెట్టడం తీవ్రమైన ప్రతికూల ఫలితాలకు దారి తీసింది. పరిశోధనమండలి పత్రిక సంపాదకులైన సవ్యసాచి భట్టాచార్య రాజీనామా చేశారు. పత్రిక సలహామండలి నుంచి ప్రఖ్యాత చరిత్ర పరిశోధకులు రొమిల్లా థాపర్, ఇర్ఫాన్‌హబీబ్ లను రావుగారు తొలగించారు.

మోడీ ప్రభుత్వ ప్రథమ వార్షికోత్సవ సంబరాల్లో భాగంగా శివసేనహిందుస్థాన్ అనే మతోన్మాదసంస్థ కార్యకర్తలు ముస్లిం పేర్లు గల నాలుగు రోడ్లను ఎంచుకుని రోడ్ల పేర్లు తెలిపే బోర్డులపై తారు పూశారు. ఈ ఉన్మాదచర్య ప్రభుత్వధోరణికి అతికినట్లుగా సరిపోయింది. ఆ నాలుగురోడ్లు ఇవి: 1. సఫ్దర్ హష్మి మార్గ్, 2.ఫిరోజ్‌షారోడ్, 3.అక్బర్ రోడ్, 4.ఔరంగజేబ్ రోడ్. ఈ నీచానికి పాల్పడిన వారిని అరెస్టు చేయలేదు. ఢిల్లీ పోలీసులు నేరుగా కేంద్రహోం శాఖ పరిధిలో పని చేస్తారన్న విషయం మనం గమనించాలి.

***మన సమాజం అజ్ఞానం, మూఢనమ్మకాలు, అంతర్గతకలహాలు అనే ప్రమాదాల్లో కూరుకుపోకుండా కాపాడుకోవాలంటే పెద్దఎత్తున ప్రజాసమీకరణలు, ఆందోళనలు నిర్వహించాలి.***

✡

# మోడీ విదేశాంగ విధానం

**- అరుణ్ కుమార్**

ప్రధానమంత్రి నరేంద్రమోడీ 12నెలల్లో 18దేశాలు పర్యటించాడు. 20రోజులకొక దేశం! అందుకేమరి, ఈ ప్రభుత్వ విదేశాంగ విధానం పాలకపక్ష భక్తబృందం అతి పెద్ద విజయంగా ప్రచారం చేసుకుంటున్నది. గబ్బుకొట్టే ఈవిదేశాంగ విధానానికి ఎంత సెంటుపూసినా చాలటంలేదు.

ప్రస్తుత బిజెపి ప్రభుత్వ విధానంలో కనిపిస్తున్న ప్రధానధోరణులు - అమెరికాకు చేరువవడం. పాలస్తీనా పట్ల మనకిప్పటివరకు వున్న సానుభూతి వైఖరిని తుంగలోతొక్కి ఇజ్రాయెల్‌తో బంధాన్ని బలపర్చుకోవడం, చైనాను 'నిలువరించేవిధంగా' మన విదేశాంగ విధానాన్ని మలుచుకోవడం. సంవత్సరం పూర్తిచేసుకున్న బిజెపి పాలన భారత విదేశాంగవిధానాన్ని అమెరికా వ్యూహాత్మక లక్ష్యాలకు అనుకూలంగా రూపుదిద్దింది. మనకు స్వాతంత్రం వచ్చిన నాటి నుండి నేటి వరకు ప్రపంచంలోని వివిధ దేశాలతో 93% సమయం యుద్ధాలు చేసే అమెరికా దేశాధ్యక్షుడు మన దేశ రిపబ్లిక్ దినోత్సవ ముఖ్య అతిథిగా పాల్గొనడం ఎన్నడూ జరగలేదు. ఇదొక వైపరీత్యం.

మోడీ అమెరికా పర్యటన, ఒబామా భారత్ పర్యటన భారత్-అమెరికాల మధ్య వ్యూహాత్మక సహకారాన్ని సుస్థిరపరచడానికి ఉపయోగపడ్డాయి. ఇద్దరు రాజ్యాధినేతలూ ఇచ్చిన ప్రకటనలను గమనిస్తే భారతదేశం అమెరికా చెప్పుచేతల్లో వుండడానికి ఇష్టపడుతున్నదని, మనదేశ వనరులు, ఆర్థిక వ్యవస్థలను మరింతగా దోచుకునే అవకాశం కల్పించబోతున్నారని స్పష్టమౌతున్నది.

అమెరికాను సంతోషపెట్టడానికి బిజెపి ప్రభుత్వం తెగపాకులాడుతోంది. ఆ రంధిలో మనదేశ స్వతంత్ర విదేశాంగ విధానాన్ని పాతిపెట్టింది. అమెరికాతో మిలిటరీ సహకారం మరింత గాఢంగా తయారవుతోంది. అమెరికా నుంచి మిలిటరీ హెలికాప్టర్ల కొనుగోలుకు నిర్ణయమైంది. భారత్‌కు ఆయుధాలమ్మే దేశాల్లో అమెరికా మొదటి స్థానానికొచ్చింది. ఇంతకుముందు మొదటిస్థానంలో రష్యా వుండేది. అమెరికాతో ఈ బంధం మరింత బలపడాలనే

ఉద్దేశంతో బిజెపి ప్రభుత్వం అమెరికాతో మరో10సం॥లపాటు అంటే 2025 వరకు మిలిటరీసహకారం కొనసాగేలా ఒప్పందం చేసుకుంది. భారత్ తన చక్రబంధంలోనే ఉండాలన్న అవసరాన్ని అమెరికా నిస్సిగ్గుగా, స్పష్టంగా చెప్తున్నది. 'చైనా నుండి రాగల ప్రమాదాన్ని నిలువరించాలంటే మాకొక స్నేహితుడవసరం. చైనాను అదుపు చేయగల శక్తిగా భారత్ నుండి మాకు చక్కని సహకారం లభిస్తుంది.' అని అమెరికా ప్రకటించింది. భారత్ అమెరికాల మధ్య జరిగిన ఒప్పందానికి 'అమెరికా–ఇండియా డిఫెన్స్ ఫ్రేమ్‌వర్క్ అగ్రిమెంట్' అని పేరుపెట్టారు. క్లుప్తంగా డిఎఫ్ఏ అంటారు. డిఎఫ్ఏ పెంటగాన్ లక్ష్యాలకు అనుగుణంగా తయారైంది.

డిఎఫ్ఏ ద్వారా భారత్ అమెరికాతో ఒక దీర్ఘకాలిక మిలిటరీ సహకార కార్యక్రమంలోకి దిగింది. ఈ సహకారంలో భాగంగా సంయుక్త మిలిటరీ విన్యాసాలు, విదేశాలలో మిలిటరీ కార్యక్రమాలు, రెండుదేశాల సైన్యాల మధ్య అవగాహన కార్యక్రమాలు వుంటాయి. అమెరికాతో సంయుక్త నావికా విన్యాసాలు ఏటా జరపడం రివాజైంది. సైన్యం, వైమానికా విభాగాలలో కూడా ఇలాంటి కార్యక్రమాల జోరుపెరిగింది. అమెరికాతో సంయుక్త విన్యాసాలు జరిపే దేశాల్లో భారత్ మొదటి స్థానాన్నందుకుంది.

అమెరికాతో మన ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందం, మిలిటరీ సంబంధాలు మనదేశానికి ఒనగూర్చే ప్రయోజనాలేమీ లేవు. మనదేశాన్ని అమెరికాకు బంటుగా మార్చే పనిలో ప్రభుత్వం వున్నది. 'మిలిటరీ సాంకేతిక మరియు వాణిజ్య చొరవ' పేరుతో అనేక కొత్త ఒప్పందాలు జరుగుతున్నాయి. ఇవన్నీ ఏకపక్షంగా అమెరికాకు లాభం కలిగించేవేగాని, అధునాతన సాంకేతికపరంగా గాని, వ్యూహాత్మకంగా గాని భారత్‌కు ఈ ఒప్పందాల ద్వారా వచ్చే ప్రయోజనం ఏమీ రావడం లేదు.

ఆసియాపసిఫిక్, హిందూ మహాసముద్రం ప్రాంతాలకు భారత్ అమెరికా సంయుక్త వ్యూహాత్మక దార్శినికత ఒక దక్షిణ చైనా సముద్ర ప్రాంతాలలో ఉభయదేశాల ప్రయోజనాలు ఇమిడి ఉన్నాయని స్పష్టంగా చెపుతున్నది. ఈ ప్రాంతంలో తమ నావికా విభాగం నుండి 60శాతం బలగాన్ని మోహరిస్తామని 'కీలక ఆసియా' అనే సిద్ధాంతంలో ఒబామా స్పష్టంచేసాడు. దీని ఉద్దేశం ఈ ప్రాంతంలో అవసరమైనప్పుడు కలగజేసుకోవడం, వాణిజ్య మార్గాలపై అదుపు సాధించి తద్వారా కట్టడి చేయాలి అని చెప్పాడు. "వ్యూహాత్మకంగా పరిశీలించినపుడు, దృఢమైన చైనాను నిలువరించేందుకు హిందూ మహాసముద్ర ప్రాంతంలో అతి శక్తివంతమైన దేశమైన భారత దేశం, ఆసియాలోనే అతి ముఖ్యమైన అమెరికా భాగస్వామియైన జపాన్ దేశాలకు మించిన మిత్రులు అమెరికాకు ఈ ప్రపంచంలోనే చాలా కొద్ది మంది మాత్రమే




ఉన్నారు.” అని వాషింగ్‌టన్ పోస్ట్ పత్రిక వ్యాఖ్యత అమెరికాకు భారతదేశంతో సంబంధంపై ఆసక్తికి కారణాన్ని స్పష్టంగా పేర్కొన్నాడు. అమెరికా ప్రయోజనాలను సమర్ధించడానికి బిజెపి ప్రభుత్వం తెగ ఉత్సాహ పడుతోంది. ‘ప్రజాస్వామ్యాన్ని విస్తరింపజేసే కృషికి రాజకీయ మద్దత్తు’ అని తమ నిర్వాకానికి పేరు పెట్టుకున్నారు. అమెరికా ఇరాక్, లిబియా, సిరియా, యెమెన్‌లలో ప్రజాస్వామ్యాన్ని ఎలా విస్తరింపజేసిందో చూస్తూనే వున్నాము. అమెరికా చేస్తున్న అంతర్జాతీయ నేరాల్లో భారత్‌ను భాగస్వామిగా చేర్చడానికి బిజెపి ప్రభుత్వం తహ తహలాడుతున్నది.

మనదేశ ప్రభుత్వం అతి భద్రంగా కాపాడుకోవలసిన సమాచారాన్ని, కీలకమైన టెక్నాలజీని సైతం అమెరికాకు అందించడానికి కూడా ఒప్పుకునేందుకు అవసరమైన అంగీకార పత్రాలు సంతకం చేసేందుకు బిజెపి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఈ విషయానికి సంబంధించి వాజ్‌పాయ్ ప్రభుత్వకాలంలోనే ఒప్పందం జరిగింది. కాని అమలుచేసే లోపు ప్రభుత్వకాలం ముగిసింది. తరువాత వచ్చిన యుపిఏ ప్రభుత్వం ఆ ఒప్పందాన్ని అమలు చేయకుండా వామపక్షాలు ప్రతిఘటించాయి. ఇప్పుడు బిజెపికి స్వంతంగా మెజారిటీ వచ్చింది. ఇన్నాళ్ళూ అమలు కోసం ఎదురుచూస్తున్న ఈ ఒప్పందానికి కార్యరూపం ఇవ్వడానికి నిశ్చయించింది.

ఒకవైపు ప్రపంచమంతా అమెరికా సమాచార గూఢచర్యం పట్ల నిరసన ప్రకటిస్తుంటే, మన ప్రభుత్వం మాత్రం మీకు శ్రమెందుకు? మీకు కావలసిన సమాచారం మేమే ఇస్తాంగదా అంటున్నారు. ఇజ్రాయెల్‌తో స్నేహం చేయడం ఒక ఘనకార్యంగా బిజెపి ప్రభుత్వం భావిస్తోంది. ఐక్యరాజ్యసమితి తీర్మానాలన్నీ ఉల్లంఘించిన హింసావాది ఇజ్రాయెల్ మనకిప్పుడు ఆత్మీయదేశం!

ఇజ్రాయెల్ నుండి ఆయుధాలు కొనే దేశాల్లో భారత్ ఇప్పుడు మొదటి స్థానంలో వుంది. ఇది పాలస్తీనా మీద ఇజ్రాయెల్ చేస్తున్న దాడులకు ఆర్థిక సాయం చేయడమే అవుతుంది. 2002 గుజరాత్ మతోన్మాద దాడులకు బాధ్యుడనే కారణంతో అనేక దేశాలు మోడీని తిరస్కరించిన కాలంలో ఆత్మీయంగా ఆహ్వానించిన దేశం ఇజ్రాయెల్. ఇప్పుడాయన ప్రధానమంత్రి అయ్యాడు. రుణం తీర్చుకునే సమయం వచ్చింది!

బిజెపి ఇజ్రాయెల్ అంటే ఇష్టపడటానికి కారణం తన మత తత్వభావజాలమే. మనదేశాన్ని హిందూ రాజ్యంగా రూపొందించాలని కోరుకుంటున్న బిజెపికి మత ప్రాతిపదిక పై ఏర్పడిన ఇజ్రాయెల్ ఆదర్శం కావటం సహజం. మతోన్మాదం, జాతి దురభిమానం, ఇస్లాం వ్యతిరేకత–ఇవన్నీ వీరిద్దరి ఉమ్మడి లక్షణాలు. ప్రస్తుత ప్రభుత్వం భారత విదేశాంగ విధానాన్ని తీవ్రమైన అప్రతిష్ట పాలుచేస్తోంది. గత సం॥జులై – ఆగస్టు మాసాల్లో ఇజ్రాయెల్ గాజాప్రాంతంపై 7వారాలపాటు ముష్కరదాడి జరిపి 2200 మంది పాలస్తీనా ప్రజల్ని హతమార్చింది. భారత్ మొదటి నుండి పాలస్తీనాకు మద్దత్తుగా నిలుస్తూవచ్చింది. ఇప్పుడు ఈ విధానం మారిపోయింది. ఇటీవలి ఇజ్రాయెల్ దాడులను ఖండించలేదు. గతంలో ఇజ్రాయెల్ దాడుల్ని మన ప్రభుత్వాలు ఖండిస్తూ వచ్చాయి. ఇప్పుడా పరిస్థితి లేదు. గాజాపై జరిగిన దాడిని ఖండిస్తూ పార్లమెంటులో తీర్మానించాలన్న ప్రతిపాదనను బిజెపి ప్రభుత్వం తిరస్కరించింది.

బిజెపి ప్రభుత్వ విదేశాంగవిధానమంతా ప్రవాసభారతీయులు పోగుచేసి గానాబజానాలు, సంబరాలు జరుపుకోవడంతోనే సరిపోతోంది. అభివృద్ధి చెందుతున్న దేశాలతో సహకారం, పొరుగుదేశాలతో సంబంధాల మెరుగుదల, సామ్రాజ్యవాద దేశాలదుండగాలను ఎదిరించడం––వీటికి అవసరమైన వ్యహాత్మక ఎత్తుగడల ప్రసక్తే లేదు.

ఈమధ్య మన రక్షణమంత్రి ఉగ్రవాదాన్ని ఎదుర్కొనే ఉగ్రవాదుల్ని తయారుచేయాలని ఒక ప్రకటన చేశాడు. పిచ్చి కుదిరింది రోకలి తలకుచుట్టు అన్నతీరులో వుంది వీళ్ళధోరణి. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికిగాని, మనపొరుగు దేశాలతో సంబంధాలు

మెరుగుపర్చుకోవడానికిగాని ఈ విధానం ఉపయోగపడదు. పాలకపార్టీకి, సంఘపరివార్‌కి చెందిన వ్యక్తులు వాడుతున్న మతోన్మాద పదజాలం ఉద్రిక్తతలను రెచ్చగొట్టేలావుంది. భారత ఉపఖండంలో అశాంతిని, యుద్ధ ప్రమాదాన్ని రగిల్చేలా వుంది; కాని శాంతిని స్థాపించేలాగా లేదు.

***అనేక అంతర్జాతీయ సమస్యల సందర్భాలలో వర్ధమాన దేశాలకు నాయకత్వం వహించిన చరిత్ర భారతదేశానిది. అది వాతావరణ పరిరక్షణ అయినా, వ్యాపారాలకు సంబంధించిన సమస్యలైనా, వ్యవసాయం, అందుకు అనుబంధ ఉత్పత్తుల విషయలోనైనా. అది ఇప్పుడు చరిత్రగా మిగిలిపోయే ప్రమాదం వచ్చింది. బిజెపి ప్రభుత్వం రావడం, దేశాన్ని మరింతగా విదేశీపెట్టుబడిదారులకి అప్పజెప్పడం, తైనాతీ విదేశాంగ విధానాన్ని చేపట్టడం వల్ల మనదేశం మునుపెన్నడూ లేని విధంగా వర్ధమాన దేశాల నమ్మకాన్ని పోగొట్టుకుంది. ఇలా విదేశాల ముందు మోకరిల్లే విధానమే మోదీ విదేశాంగ విధానం.***

✡

# పెరుగుతున్న ప్రజా ప్రతిఘటన

**-మహేష్, సవేరా**

మోడీ గారి వంది మాగధులు ప్రపంచాన్ని నమ్మబలికిస్తున్న తీరు, మోడీగారు ప్రవాస భారతీయులతో కలిసి ఆయాదేశాలలో ఆడుతున్న నాటకాలు, భారత ప్రజల మనో భావాలకు ప్రతిబింబాలు కావు. మోడీ ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల, ప్రజావ్యతిరేక విధానాలతో పని చేయడాన్ని, పరిపాలనలో ఆర్.ఎస్.ఎస్. పాత్ర పెరగడాన్ని ప్రజలు గమనిస్తున్నారు. వారిలో భ్రమలు తొలగి పోతున్నాయి. అసంతృప్తి పెరుగుతున్నది. జాతీయస్థాయిలోను, ప్రాంతీయ స్థాయిలోను నిరసనలు, ఆందోళనలు ప్రారంభమయ్యాయి. ఈ సంవత్సరకాలంలో దేశంలోజరిగిన ప్రముఖమైన నిరసన కార్యక్రమాలను పరిశీలిస్తే మనకీ విషయం అర్థం అవుతుంది.

**భూసేకరణ బిల్లు:** మోడీ ప్రభుత్వం దౌర్జన్యంగా ఆర్డినెన్సు రూపంలో రుద్దుతున్న భూసేకరణ బిల్లును వ్యతిరేకిస్తూ పల్లెలకు పల్లెలే కదిలి వచ్చాయి. వామపక్షాలు, అనేక రైతు, వ్యవసాయకార్మిక సంఘాలు సమైక్యంగా సాగించిన ఉద్యమం పార్లమెంటు వద్దకు 2015 ఫిబ్రవరి15న బ్రహ్మాండమైన ప్రజాప్రదర్శనగా ఎగసింది. అదే సమయంలో దేశవ్యాప్తంగా 400జిల్లాల్లో లక్షలాది రైతులు, వ్యవసాయకార్మికులు నిరసన ప్రదర్శనలు చేశారు. సమస్య ఇంకా పరిష్కారం కాలేదు. ఏదైనా చేయగలమన్న ధీమాతో, పొగరుతో వున్న ప్రభుత్వంతో పోరాటానికి ప్రజలు సిద్ధంగా వున్నారు.

**కార్మికులు:** మోడీ ప్రభుత్వం చేపట్టిన ప్రైవేటీకరణను, ప్రభుత్వరంగం పెట్టుబడుల ఉపసంహరణను, కార్మిక చట్టాల సవరణను, కార్మికులను అణచివేసే విధానాలను వ్యతిరేకిస్తూ కార్మికవర్గం ఆందోళనలు ప్రారంభించింది. సమ్మెలు చేసింది.

2015 ఫిబ్రవరి26న కేంద్రకార్మిక సంఘాల పిలుపుననుసరించి పార్లమెంటు వద్ద వేలాది మంది కార్మికులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఇది కార్మికచట్టాల సవరణకు వ్యతిరేకంగా జరిగింది. ఇలా ప్రారంభమైన నిరసన దేశమంతా వ్యాపించింది. లక్షలాది

కార్మికులు నిరసన ప్రదర్శనలు, ధర్నాలలో పాల్గొన్నారు. కనీసవేతనం 15వేలరూ॥గా నిర్ణయించాలనే డిమాండు ముందుకొచ్చింది. ఈ డిమాండ్లను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో అన్ని కేంద్ర కార్మికసంఘాలు (బిజెపి అనుబంధసంఘంతో సహా) ఒక చారిత్రాత్మక సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చాయి. అది సెప్టెంబరు 2న జరగనున్నది. బ్రహ్మాండమైన ప్రజా ఉద్యమానికి ఇది నాంది పలుకుతుంది.

2015 జనవరి7,8తేదీలలో బొగ్గు రంగం ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ దాదాపు 7లక్షల మంది బొగ్గు కార్మికులు సమ్మెచేశారు. ఈ సమ్మెలో కాంట్రాక్టు కార్మికులు కూడా పాల్గొన్నారు. పోలీసుల నిర్బంధాన్ని, మాఫియా దుండగుల దాడులను ప్రతిఘటించి పోరాటంలో పాల్గొన్నారు.

*ప్రభుత్వ సంస్థ ఐన బిఎస్ఎన్ఎల్‌కు చెందిన 2లక్షల 25వేల మంది ఉద్యోగులు దేశవ్యాప్తంగా 2రోజుల సమ్మె చేశారు. 2015 ఏప్రిల్ 21,22తేదీలలో ఇది జరిగింది. ప్రభుత్వరంగ టెలికం సంస్థను నిర్లక్ష్యం చేస్తూ, ప్రైవేటు సంస్థలకు అనుకూలిస్తున్న ప్రభుత్వ విధానాలను నిరసించారు.*

*2015 ఏప్రిల్ 6న భవననిర్మాణ కార్మికులు పని పరిస్థితుల మెరుగుదల, రక్షణ ఏర్పాట్లు కోరుతూ ఢిల్లీలో పెద్ద ప్రదర్శన జరిపారు.*

*2015 మార్చి9న దేశవ్యాప్తంగా ఇన్సూరెన్సు ఉద్యోగులు సమ్మె చేశారు. ఇన్సూరెన్సు రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి పరిమితిని 26% నుండి 49%కు పెంచుతూ మోడీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఈ సమ్మె చేశారు.*

*2015 ఏప్రిల్ 15న రోడ్డు రవాణా కార్పొరేషన్ల కార్మికులు, ప్రైవేటు రవాణా సంస్థల కార్మికులు మొత్తం 2కోట్ల మంది దేశవ్యాప్తంగా సమ్మె చేశారు. దేశంలోని 54 రాష్ట్ర రోడ్ రవాణా సంస్థలను బద్దలు కొట్టి ప్రైవేటీకరించడం కోసం మోడీ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నానికి వ్యతిరేకంగా జరిగిందీ కార్యక్రమం.*

2014 నవంబరు21న దేశరాజధానిలో శ్రామిక మహిళల ప్రదర్శన జరిగింది. 23వేల మంది అంగన్ వాడీ వర్కర్లు, హెల్పర్లు దేశంలోని అన్ని ప్రాంతాల నుండి వచ్చి పార్లమెంటు వద్దకు చేరారు. ఉద్యోగాల క్రమబద్ధీకరణ, కనీస వేతనాల చెల్లింపు డిమాండు చేశారు. సమగ్ర శిశుసంక్షేమపథకం ప్రైవేటీకరణ పట్ల నిరసన తెలిపారు.

*2014 ఆగస్టు5న మధ్యాన్న భోజన పథకం వర్కర్లు వేతనాల పెంపు, సర్వీసు క్రమబద్ధీకరణ కోరుతూ పెద్ద ప్రదర్శన జరిపారు.*

*2015 మార్చి1న వేల సంఖ్యలో ఆశావర్కర్లు (మహిళాఆరోగ్య కార్యకర్తలు) ప్రదర్శన జరిపారు.*

**జాతీయ గ్రామీణ ఉపాధి పథకం:** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి గ్యారంటీ పథకాన్ని బలహీన పరచే పనిని యుపిఏ ప్రభుత్వం తన రెండోవిడత పాలనలో మొదలుపెట్టింది. పథకాన్ని పూర్తిగా మూసేసే ఆలోచనలో ప్రస్తుత బిజెపి ప్రభుత్వం వుంది. మంత్రులు, అధికారులు కార్యక్రమాన్ని తగ్గిస్తున్నామని ప్రకటనలు చేశారు. గ్రామీణ భారతంలోని నిరుపేద ప్రజానీకం నుండి నిరసన వ్యక్తమైంది. జాతీయ స్థాయిలో 2014 నవంబరు 26న సి.పి.యం. పార్లమెంటు ఆవరణలో బైఠాయింపు కార్యక్రమం జరిపింది. త్రిపుర ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ ఈ నిరసనకు నాయకత్వం వహించారు. ఉపాధిపథకాన్ని కేంద్రం త్రిపురలో కక్షతో కోసివేసినందుకు నిరసన తెలిపారు. నిరసన కార్యక్రమాలు రాష్ట్ర రాజధానులలో కూడా జరిగాయి. రాజకీయ పార్టీలు, ఆర్థిక నిపుణులు, స్వచ్ఛంద సంస్థలు, సామాజిక ఉద్యమాలు, భూమిలేని శ్రామికుల సంఘాలు ప్రభుత్వ వైఖరిని వ్యతిరేకించాయి. మేమీ పథకాన్ని రద్దు చేయడం లేదని ప్రభుత్వం ప్రకటించింది. వీరీ ప్రకటనకు కట్టుబడరని అర్థమౌతోంది. యుపిఏ మాదిరిగానే ఈ ప్రభుత్వం కూడా నిధులను ఆపి వేయడం ద్వారా పథకాన్ని పడుకోబెట్టే దారిలోనే వుంది.

**ఆదివాసీ నిరసన:** ఆదివాసు లెక్కువగా వున్న ప్రాంతాలలో ప్రాజక్టులకు సంబంధించి వారిని సంప్రదించక పోవడం, వారు నిర్వాసితులు కావడం జరుగుతున్నది. నిరసనగా అనేకచోట్ల ఆదివాసులు ఆందోళనలు చేస్తున్నారు. 2015 మే నెలలో జార్ఖండ్‌లోని రాంచీలో పెద్ద ఐక్య ప్రదర్శన జరిగింది. వందలాది ఆదివాసీ గ్రామాలను మాయం చేసే 'మాస్టర్‌ప్లాన్' అనే పథకాన్ని వ్యతిరేకిస్తూ ఈ ప్రదర్శన జరిపారు. అదే నెలలో మార్క్సిస్టు పార్టీ, ఆదివాసీ హక్కుల సంఘం, కిసాన్‌సభల నాయకత్వంలో అటవీ హక్కుల చట్టం అమలును డిమాండ్ చేస్తూ మహారాష్ట్రలో పెద్ద ప్రదర్శన జరిగింది. పోలవరం ప్రాజక్టు వల్ల ముంపుకు గురయ్యే ఆంధ్ర, తెలంగాణ ఆదివాసులు సమావేశాలు, ప్రజావేదికలు నిర్వహిస్తున్నారు.

**ధరల పెరుగుదలకు నిరసనగా:** నిత్యావసర సరుకులు ప్రధానంగా కూరగాయలు, పాలు, వంటనూనె, ఇంధనాలు– ధరలు విపరీతంగా పెరగడాన్ని నిరసిస్తూ దేశవ్యాప్తంగా ప్రదర్శనలు జరిగాయి. మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. మార్కెట్‌ను అదుపు చేయకుండా వదిలేసి 'టోకుధరలు పెరగలేదు చూడండని' కబుర్లు చెబుతున్నారు. రైలు ఛార్జీలు పెంచినందుకు నిరసనగా రాష్ట్రాల రాజధానులలోను, ఢిల్లీలోను ప్రదర్శనలు జరిగాయి. 2015 మే నెలలో బడ్జెట్‌లోని ప్రజావ్యతిరేక ధోరణులు, మహిళలు, పిల్లలపై పడే ప్రతికూల ప్రభావాల గురించి ప్రజావేదికలు జరిగాయి. వేల సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.



**మతతత్వానికి, కాషాయీకరణకు వ్యతిరేకంగా:** విద్యను కాషాయీకరించడాన్ని, ప్రైవేటీకరించడాన్ని నిరసిస్తూ 2015 ఫిబ్రవరి26న పార్లమెంటు వద్ద విద్యార్థులు ప్రదర్శన చేశారు. లవ్ జిహాద్, ఘర్ వాపసీ అనే పేర్లతో దేశంలో మతవైషమ్యాలను రగిల్చే కార్యక్రమాలను వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా నిరసనలు జరిగాయి. ప్రేమించే హక్కు, జీవిత భాగస్వామిని ఎన్నుకునే హక్కు, తమ వ్యక్తిగత హక్కులని ప్రకటిస్తూ అనేక రాష్ట్రాలలో మహిళలు ప్రదర్శనలు జరిపారు.

**అమెరికా సామ్రాజ్యవాదంతో స్నేహానికి నిరసనగా:** మోడీ ప్రభుత్వం అమెరికా అధ్యక్షుడిని మన రిపబ్లిక్ దినోత్సవానికి ఆహ్వానించడాన్ని, అమెరికా సామ్రాజ్యవాదంతో మిలాఖత్ అవడాన్ని, భారత్‌ను అమెరికాకు అనుచర దేశంగా మార్చడాన్ని నిరసిస్తూ దేశరాజధానిలోను, రాష్ట్రాల రాజధానులలోను, జిల్లాకేంద్రాలలోను నిరసనలు జరిగాయి.

***మోడీ ప్రభుత్వ విధానాల పట్ల ప్రజల కోపం, తిరస్కారం స్పష్టంగా వ్యక్తమౌతున్నాయి. రానున్న రోజుల్లో ఈ ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల, ప్రజావ్యతిరేక విధానాలు పెరిగేకొద్దీ వామపక్షాల నాయకత్వంలో ప్రజాసంఘాలు మరింత పెద్ద స్థాయిలో ఉద్యమాలకు, పోరాటాలకు సిద్ధమౌతారు. మోడీ ప్రభుత్వాన్ని తుదముట్టించడానికి ఉద్యమిస్తారు.***

# మా మంచి పాలన

## - ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేయడం, కాషాయకషాయాన్ని తాగించడం

**- కిరణ్**

12సంవత్సరాలు గుజరాత్ ముఖ్యమంత్రిగా మోడీ పరిపాలించిన తీరు తెలిసినవారికి ఆయనిప్పుడు ప్రధానిగా వ్యవహరిస్తున్న తీరు ఆశ్చర్యం కలిగించదు. ఆయన ప్రసంగాలు స్వాతిశయోక్తులతో నిండి వుంటాయి. తనను తనే ఉటంకిస్తూవుంటాడు. ఆయన ఒక అధికార కేంద్రంగా మాత్రమే పని చేయగలడు. భిన్నాభిప్రాయాన్ని ఏమాత్రమూ సహించడు. చివరికి తన పార్టీలోనైనా, క్యాబినెట్‌లోనైనా చర్చకు ఏమాత్రం అవకాశం లేదు. తన మాటే ఆఖరి మాట కావాలి. ఇన్నీ తెలిసిన వారికి కూడా ప్రధానిగా ఈ సంవత్సర కాలంలో ఆయన పనితీరులోని హద్దులేని నిరంకుశవైఖరి ఆశ్చర్యం కలిగించింది.

ప్రభుత్వం ఏర్పడగానే ప్రధాని మోడీ కోరుకున్న వ్యక్తిని ముఖ్యకార్యదర్శిగా నియమించుకోవడం కోసం ఒక ఆర్డినెన్సు జారీ చేశారు. ఆ వ్యక్తి పేరు నృపేంద్ర మిశ్రా. ఈయన గతంలో ట్రాయ్ (టెలికం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా) ఛైర్మన్‌గా పనిచేశారు. ట్రాయ్ ఛైర్మన్‌గా పనిచేసిన వారు అనంతరం ప్రభుత్వాధికారిగా పని చేయకూడదని ట్రాయ్ చట్టంలో వుంది. ఈ అవరోధాన్ని అధిగమించడానికి ఆర్డినెన్సు తెచ్చారు. మోడీగారి వైఖరి స్పష్టం. 'నేను అనుకున్నది చేయడానికి చట్టం అడ్డమొస్తే చట్టాన్నే మార్చేస్తాను.' ఈ ప్రభుత్వ పాలన ఇలా అద్భుతంగా మొదలైంది.

12నెలలు గడిచాయి ఇప్పుడందరికీ అర్ధమైంది–నడుస్తున్నది ఏకవ్యక్తి పాలన అని. సీనియర్ క్యాబినెట్ మంత్రులు సైతం ప్రేక్షకులుగా మిగిలారు. వారికి కార్యదర్శులుగా ఎవరు కావాలో కోరుకునే పరిస్థితి కూడా లేదు. ఎవర్ని నియమిస్తారో తెలియదు. ఒకే ఒక వ్యక్తి కోరికలే ఇప్పుడు ముఖ్యం. మంత్రులతో చర్చించడం మాట అటుంచి ఫలానా వ్యక్తి తన శాఖలో కార్యదర్శిగా నియమితులయ్యారని మంత్రిగారు వార్తాపత్రికలో చూసి తెలుసుకుంటారు.

బిజెపి నాయకత్వంలో తనను ఆమోదించని వ్యక్తులెవరూ లేకుండా మోడీ చూసుకున్నాడు. తన నమ్మిన బంటు అమిత్ షాను పార్టీ అధ్యక్షుడిగా కూర్చోబెట్టాడు. పార్టీ ఉన్నత కమిటీలలో తనకు నచ్చని వారెవరూ లేకుండా చూసుకున్నాడు. ఎంత సీనియర్ నాయకులైనా, పార్టీకోసం ఎంతోకృషి చేసినవారైనా తనకు తందానా అనరు అనుకున్నవారిని పక్కన బెట్టారు. సందేశం స్పష్టం–నేనే సర్వాధికారిని.

పార్లమెంటు పట్ల వ్యవహరించే తీరులో కూడా నిరంకుశధోరణి కనిపిస్తోంది. ఏ ప్రతిపాదనకైనా పార్లమెంటులో ఏమాత్రం ప్రతిఘటన వచ్చే సూచన కన్పించినా దాన్ని ఆర్డినెన్సు రూపంలో చలామణీ చేయడం సాధారణమైంది. దీనికొక గొప్ప ఉదాహరణ మనముందుంది. భూసేకరణబిల్లును 3సార్లు ఆర్డినెన్సుగా జారీ చేశారు. ఆర్డినెన్సుల జారీ తప్పనిసరి పరిస్థితుల్లోనే చేయాలి. పార్లమెంటు సమావేశమై చర్చించి చట్టం చేయడానికి వ్యవధి లేదనుకున్నప్పుడు మాత్రమే ఆర్డినెన్సులు జారీ చేయాలి. వాటికి వీలైనంత త్వరగా పార్లమెంటు ఆమోదం తీసుకోవాలి. అలా చేయడం ప్రజాస్వామ్య ప్రక్రియ. పార్లమెంటును లెక్కచేయకుండా అదే పనిగా ఆర్డినెన్సులు జారీచేయడం ప్రజాస్వామ్యం కాదు. ఈ ప్రభుత్వానికి పార్లమెంటు అంటే కనీస గౌరవం కూడా లేదని వ్యవహారశైలి స్పష్టం చేస్తోంది.

ఈ ప్రభుత్వం 50కి పైగా చట్టాలు చేసింది. వీటిలో చాలా తక్కువ చట్టాల్ని స్థాయీసంఘాల ముందుంచడం జరిగింది. స్థాయీసంఘాలలో ప్రతిపక్షాలకు కూడా ముఖ్యమైన పాత్ర వుంటుంది. నిర్ణయాలకు సంబంధించి ప్రతిపక్షాలను కలుపుకుపోవాలి అనే విషయంలో మోడీ ప్రభుత్వానికే మాత్రం ఆసక్తి లేదు. ఎంత మెజారిటీ ఉన్నప్పటికీ పార్లమెంటు పట్ల చూపుతున్న ఈ నిర్లక్ష్యం ఆశ్చర్యం కల్గించక మానదు. అదీ ఎన్నికల్లో బిజెపికి వచ్చింది 31శాతం ఓట్లు. మా మిత్రపక్షాల ఓట్లు కూడా కలిపి చూడండంటారు బిజెపి వారు. మొత్తం యన్‌డిఏ ఓట్లు 31శాతం కంటే ఎక్కువే. ఐతే ఇప్పుడు యన్‌డిఏ ఎక్కడుంది? వాస్తవానికి యన్‌డిఏ అనేది నామమాత్రంగా మిగిలిపోయింది. ఈ సంవత్సర కాలంలో యన్‌డిఏ సమావేశం ఒక్కసారి కూడా జరగలేదు. బిజెపి తన మిత్రపక్షాలకిచ్చే గౌరవం ఏపాటిదో అర్థమౌతూనే వుంది. ఆఖరుకు సైద్ధాంతికంగా తనకు దగ్గరగా వుండే శివసేనకు సైతం బిజెపి చేతిలో భంగపాటు తప్పలేదు.

ఈ ప్రభుత్వం నిరసనను ఏమాత్రం సహించదన్న విషయం తన ఆచరణను ప్రశ్నిస్తున్న స్వచ్ఛంద సంస్థలు, సామాజిక కార్యకర్తల పట్ల వ్యవహరిస్తున్న తీరు చెబుతోంది. ఉదాహరణకు

తీస్తా సెతల్వాద్, గ్రీన్ పీస్‌కు చెందిన ప్రియా పిళ్ళైలను వేధిస్తున్న పరిస్థితి మనం చూస్తున్నాం. ప్రధానమంత్రిపై వ్యాఖ్యలు చేశారని మద్రాస్ ఐఐటి విద్యార్థుల సామాజిక సంస్థను నిషేధించారు.

సహకార ఫెడరల్ స్ఫూర్తి పట్ల తమకెంతో విశ్వాసముందనీ, రాష్ట్రాలను సమాన భాగస్వాములుగా గౌరవిస్తామనీ చెప్పుకున్నారు. కేంద్రానికి పన్నుల ద్వారా వచ్చే ఆదాయంలో రాష్ట్రాల వాటాను 32శాతం నుండి 42శాతానికి పెంచటం తమ ఔదార్యమని చెప్పుకుంటున్నారు. వాస్తవానికి ఈ పెంచడం ఆర్థిక సంఘం సిఫార్సుల వల్ల జరిగింది కాని, మోడీ ప్రభుత్వ ఘనత కాదు. ఆచరణలో కేంద్రం నుంచి రాష్ట్రాల కొచ్చే నిధులు తగ్గిపోయాయని రాష్ట్రాలు ఫిర్యాదు చేస్తున్నాయి. ఒకవైపు పన్ను ఆదాయాన్ని పెంచినట్లే పెంచి మరోవైపు కేంద్రం బాధ్యత వహించే పథకాలకు ఇవ్వాల్సిన నిధులలో భారీకోతలు విధించారు. ఫలితంగా రాష్ట్ర ఆదాయాలకు గండి పడింది.

ఈ విధంగా ప్రతి విషయంలోనూ మాటలకు, చేతలకు పొంతన లేకుండా పోయింది. మేము అవినీతిని అంతమొందిస్తాము అని ధీమాగా చెప్పారు. ఇదివారి ముఖ్యమైన ప్రచార నినాదాల్లో ఒకటి. అధికారం లోకొచ్చాక ఆచరణ అందుకు విరుద్ధం. గత రెండు దశాబ్దాలుగా అమలు జరుగుతున్న నయా ఉదారవాద విధానాలు అనంతమైన అవినీతికి బాటలు వేసింది. ఈ ప్రభుత్వం అవే అవినీతిమయ ఆర్థిక విధానాలను మరింత ఉత్సాహంతో అమలు చేస్తోంది. ఇక నల్లధనానికి సంబంధించి ఎన్నికల సమయంలో గొప్ప వాగ్దానం చేశారు. విదేశాల్లో దాచిన నల్ల ధనాన్నంతా వెనక్కు తెస్తామని, అలా దాచిన వారందరిపై కేసులు పెడ్తామని అన్నారు. జరిగింది శూన్యం.

మంచిపాలన ఇస్తాం అని కూడా ఈ ప్రభుత్వం మాటిచ్చింది. ఇది కూడా నీటి మీద రాతే అయింది. మత తత్వ ధోరణులను ప్రోత్సహించే పాలన మంచి పాలన ఎలా అవుతుంది? (వీరు చెప్పే మాటలకు వ్యతిరేకార్థ నిఘంటువు ఒకటి తయారుచేసుకోవాలి.) సంఘ పరివార శక్తులు విరామం లేకుండా మతోన్మాద ప్రచారం సాగిస్తున్నారు. వారికి ధీటుగా సాక్షి మహరాజ్ వంటి బిజెపి పార్లమెంటు సభ్యులు, సాధ్వి నిరంజన్ జ్యోతి వంటి మంత్రులు విషం చిమ్ముతున్నారు. నిరంజన్ జ్యోతి రాంజాదే, హరాంజాదే అనే మాటలు వాడారు. రాంజాదే అంటే రాముని సంతానం అనీ అంటే రాముని పూజించే వారనీ అంటే హిందువులనీ అర్థం వస్తుంది. హరాంజాదే అనేది సభ్యసమాజంలో వాడకూడని మాట. అసహ్యమైన తిట్టు. ఇంగ్లీషులో బాస్టర్డ్ అని అర్థం. రాంజాదేలు కాని వారందరూ హరాంజాదేలే అని వీరి తీర్పు.

ఈరకంగా వీళ్ళు రెచ్చిపోతుంటే ప్రధాని స్పందన ఏమిటి? మౌనమే. ఈ అసభ్యముష్కర మూకను అదుపు చేసే ఆలోచనే లేదు!

మానవ వనరుల అభివృద్ధి శాఖామాత్యులు స్మృతి ఇరానీ కాషాయకార్యక్రమాన్ని నిస్సంకోచంగా ముందుకు తీసుకెళుతున్నారు. ఆర్ ఎస్ ఎస్ కు చెందిన సుదర్శనరావు అనే వ్యక్తిని ప్రతిష్ఠాత్మకమైన భారత చరిత్ర పరిశోధన మండలికి అధ్యక్ష పదవిలో నియమించారు. రావుగారు చురుగ్గా పనిలోకి దిగారు. సంస్థకు చెందిన పత్రిక సలహా మండలిని రద్దు చేశాడు. ఈ విధంగా రొమిలా థాపర్, సతీష్ చంద్ర, ఇర్ఫాన్ హబీబ్ అనే ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన, విలువైన చరిత్రకారులకు ఉద్వాసన పలికాడు. ఈ చర్య భారతదేశంలోను, ప్రపంచ వ్యాప్తంగాను విద్యావేత్తలను దిగ్భ్రాంతికి గురి చేసింది.

***ఒకవైపు పూర్తి కేంద్రీకృతమైన కార్పొరేట్ అనుకూల పాలన, నిరసనను అణచివేసే నిరంకుశ విధానాలు, మరోవైపు సంఘపరివార లక్ష్యాలను ముందుకు తీసుకెళ్ళడం... ఇదీ మోడీ గారి వ్యూహం.***







వెల రూ. 20/-

27-13-3, సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ కార్యాలయం, ఆకుల వారి వీధి, గవర్నర్‌పేట
విజయవాడ - 2, ఫోన్ నెం. 0866 2577202